తక్కువ ధరకే ప్రకటనలు
మీ వ్యాపార అభివృద్ధి కోరకు..
ప్రకటనలు అత్యంత తక్కువ ధరకే
(అన్ని పత్రికల కంటే తక్కువ ధరకే)
ప్రతి రోజు వేయబడును
ఆంధ్ర ప్రదేశ్ & తెలంగాణ
సెల్ : 79894 45029 సెల్ : 73862 03537
email: suryaudhyamdaily@gmail.com

RNI APTEL /2017/74254

# సూర్య ఉదయం

ప్రతి పదం... ప్రజా శ్రేయస్కరం

తెలుగు దిన పత్రిక

విలేకరులు కావలెను
సూర్య ఉదయం తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ ,తెలంగాణలో అన్ని నియోజకవర్గ, కేంద్రాలలో ఆసక్తి గల విలేకరులు కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడునుపూర్తి వివరాలకు సంప్రదించండి.
ఐడి కార్డు ఉచితం
యం.సునీల్ కుమార్
సూర్య ఉదయం తెలుగు దిన పత్రిక ఎడిటర్
సెల్ : 08512 254632

ఎడిటర్ : యం. సునీల్ కుమార్ సంపుటి : 08 సంచిక : 103 శనివారం 07 - 03 - 2026 పేజిలు : 08 వెల రూ. 5 రూ/

Published From Kurnool : Circulated at VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam,Chittoor, Kurnool, Kadapa, Anantapuram, Hyderabad



## విపక్షం లేకున్నా ప్రజల కోసమే చర్చలు

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- 15 రోజుల పాటు అసెంబ్లీలో చర్చలు జరిపినట్టు చంద్రబాబు వెల్లడి
- గత పాలకుల విధ్వంసం నుంచి ఏపీ పునర్నిర్మాణం జరుగుతోందని ఉద్ఘాటన
- సభలో లేకుండా పారిపోయిన పార్టీ ప్రతిపక్షం హోదా కోసం డిమాండ్ చేస్తోందని ఎద్దేవా
- ఆర్థిక ఇబ్బందులున్నా సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేశామన్న సీఎం


**అమరావతి :**

గడచిన పదిహేను రోజులుగా ఆంధ్రప్రదేశ్ శాసనసభ వేదికగా కేవలం చట్టాలు చేయడం మాత్రమే కాకుండా, రాష్ట్రంలోని - మిగతా 2 లో

## ఏపీలో 13 ఏళ్ల లోపు పిల్లలకు

# సోషల్ మీడియా నిషేధం

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ప్రకటన
- కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం
- పిల్లలు సోషల్ మీడియా వినియోగంపై సీఎం చంద్రబాబు అసెంబ్లీలో కీలక వ్యాఖ్యలు
- 13 ఏళ్ల లోపువారు సామాజిక మాధ్యమాలు వాడకుండా నిషేధిస్తున్నామని 16 ఏళ్ల వారి విషయంపైనా ఆలోచిస్తున్నామని వెల్లడి
- 90 రోజుల్లోగా చర్యలు చేపడతామన్న సీఎం చంద్రబాబు
- జాతీయ స్థాయిలోనూ పాలసీ తేవాలని కోరిన టీడీపీ
- సోషల్ మీడియా అందుబాటులో లేకుండా చేసే కార్యక్రమానికి 90 రోజుల్లో శ్రీకారం చుడతామని స్పష్టం చేశారు



**అమరావతి :**

ఏపీలో 13 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియాను బ్యాన్ చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో మంత్రి నారా లోకేశ్ దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. ఇప్పుడు తాజాగా సీఎం చంద్రబాబు అసెంబ్లీలో పిల్లలు సోషల్ మీడియా వినియోగించకుండా నిషేధం విధించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే కర్ణాటక సీఎం సిద్ధరామయ్య తమ రాష్ట్రంలోని 16 ఏళ్లలోపు పిల్లల సోషల్ మీడియా వాడకంపై నిషేధం విధిస్తున్నట్లు తాజాగా వెల్లడించారు. పిల్లలు మొబైల్ ఫోన్ వ్యసనం బారినపడకుండా అడ్డుకోవడానికే ఈ ముందుజాగ్రత్త చర్యను చేపడుతున్నట్లు తెలిపారు.పిల్లలు సోషల్ మీడియా వినియోగంపై సీఎం చంద్రబాబు అసెంబ్లీలో కీలక వ్యాఖ్యలు చేశారు. 13 ఏళ్లలోపు వారు సోషల్ మీడియా - మిగతా 2 లో

## గత హయాంలో ఆర్థిక విధ్వంసం వల్ల

# రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి



- ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- అసెంబ్లీలో బడ్జెట్, ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ
- తాజా బడ్జెట్ 5 కోట్ల ఆంధ్రుల ఆకాంక్షలకు ప్రతిరూపమన్న పవన్
- వైసీపీ హయాంలో విద్యుత్ సంస్థలు రూ. 1.29 లక్షల కోట్ల నష్టాల్లో కూరుకుపోయాయని వెల్లడి

**అమరావతి :**

ఆంధ్రప్రదేశ్ శాసనసభలో బడ్జెట్, ద్రవ్య వినిమయ బిల్లుపై జరిగిన చర్చలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రసంగిస్తూ గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. జగన్ పాలనలో జరిగిన 'ఆర్థిక విధ్వంసం' కారణంగా రాష్ట్రం - మిగతా 2 లో

## దేశానికి మార్చి చివరికలా

# నక్సలిజం నుంచి విముక్తి

- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా
- 2026 మార్చి 31 నాటికి దేశం నక్సల్స్‌రహితంగా మారుతుంది
- నక్సలిజం నిర్మూలనలో సీఐఎస్ఎఫ్ కీలకపాత్ర పోషించిందన్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా
- రెడ్ కారిడార్ ఏర్పాటు చేయాలనుకున్న వారిని భద్రతాదళాలు ఓడించాయన్న షా
- ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి నుంచి నేపాల్‌లోని పశుపతి వరకు రెడ్ కారిడార్ ఏర్పాటు చేయాలని కలలు కన్నవారిని భద్రతాదళాలు పూర్తిగా ఓడించి తమ ఆధిపత్యం చాటుకోనున్నాయి



**ఢిల్లీ :**

దేశంలో నక్సలిజాన్ని తుదముట్టించాలని మోదీ సర్కార్ తీసుకున్న సంకల్పాన్ని పూర్తిచేయటంలో సీఐఎస్ఎఫ్ కీలకభూమిక పోషించినట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ లేదా తెలంగాణలో నక్సలిజాన్ని నిర్మూలించడంలో సీఐఎస్ఎఫ్ కీలకపాత్ర పోషించిందన్నారు. ఒడిశా కటక్‌జిల్లాలోని ముండలిలో జరిగిన సీఐఎస్ఎఫ్ 57వ వార్షికోత్సవంలో పాల్గొన్న అమిత్ షా తిరుపతి నుంచి పశుపతి వరకు రెడ్ కారిడార్ ఏర్పాటు చేయాలని కలలు కనేవారి కలలను భద్రతా దళాలు కల్లలు చేశాయన్నారు."ఈ సందర్భంగా దేశప్రజలకు ఒక విషయం స్పష్టం చేయాలనుకుంటున్నా. 2026 మార్చి 31 నాటికి దేశం - మిగతా 2 లో




## కొన్ని దేశాలు మధ్యవర్తిత్వానికి ప్రయత్నిస్తున్నాయి

- ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్
- అమెరికా ఇజ్రాయెల్ యుద్ధంపై స్పందించిన ఇరాన్ అధ్యక్షుడు
- ఇజ్రాయెల్ పైకి అత్యాధునిక ఖోరంషహర్-4 క్షిపణుల ప్రయోగం
- ఇరాన్ నేవీని నామరూపాల్లేకుండా చేశామన్న అమెరికా
- భారీ బాంబులతో ఇరాన్ అణు కేంద్రాలపై విరుచుకుపడ్డ బి-2 బాంబర్లు

## హోర్ముజ్ జలసంధిలో భారత నౌకలకు ఆటంకం కలిగించడం లేదు

- ఇరాన్ డిప్యూటీ విదేశాంగ మంత్రి సయీద్ ఖతిబ్‌జాదే
- హిందూ మహాసముద్రంలో తమ నౌకలపై జరుగుతున్న దాడిని భారత్ అడ్డుకోవాలన్న ఇరాన్
- అంతర్జాతీయ జలాల్లో అమెరికా తీరు ప్రమాదకరంగా ఉందన్న ఇరాన్ మంత్రి
- భారత్, ఇరాన్ మనస్తత్వం ఒకటేనని వ్యాఖ్య




## హైదరాబాద్ వాతావరణ కేంద్రం కార్యాలయానికి బాంబు బెదిరింపు

- 14 బాంబులు పెట్టామని, మధ్యాహ్నం పేలుతాయని బెదిరింపు మెయిల్
- పోలీసులకు సమాచారం అందించిన సిబ్బంది
- తనిఖీ చేసి ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని నిర్ధారించిన బాంబు స్క్వాడ్




## ఇది ఉత్తి దండగ ప్రచార పర్వం




- బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు
- కాంగ్రెస్ ప్రభుత్వ 99 రోజుల ప్రణాళికపై హరీశ్ రావు విమర్శలు
- గతంలో ఇచ్చిన దరఖాస్తులు ఇంకా చెత్తబుట్టల్లోనే ఉన్నాయని వెల్లడి
- రైతు భరోసా ఇవ్వకుండా అన్నదాతలను నడిరోడ్డుపైకి తెచ్చారని ఆగ్రహం
- పాలన గాలికి వదిలి పబ్లిసిటీ పాకులాడుతున్నారని మండిపాటు




## త్వరలో తెలంగాణలో రాజకీయ పార్టీని స్థాపిస్తున్నా

- తిరుమలలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- భర్తతో కలిసి శ్రీవారిని దర్శించుకున్న కవిత
- వేకువజామున అభిషేక సేవలో పాల్గొన్న కవిత దంపతులు
- నాలుగేళ్లుగా పడుతున్న మనోవేదన స్వామివారి దయతో తీరిందన్న కవిత

## కర్ణుడిలా నేనూ

# మిత్రధర్మానికి కట్టుబతా

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- మాదిగల వెంట కర్ణుడిలా నిలబడ్డానన్న సీఎం రేవంత్ రెడ్డి
- భవిష్యత్తులో మాదిగల హక్కులకు చట్టబద్ధత కల్పిస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి
- గత ప్రభుత్వం బర్రెలు, గొర్రెలు, చేపలను ఇచ్చిందంటూ ధ్వజం
- మాదిగలు కూడా ఐఏఎస్, ఐపీఎస్, ఎంపీ, ఎమ్మెల్యేలు అవ్వాలని ఆశాభావం
- ఎస్సీ, ఎస్టీ,బీసీలకు సంక్షేమ ఫలాలు అందించాలనేదే ప్రభుత్వ లక్ష్యమన్నారు



**హైదరాబాద్ :**

మాదిగల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.మద్దతిస్తూ అండగా నిలిస్తే మరింత ముందుకు తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్ శిల్పకళావేదికలో ఏర్పాటు చేసిన మాదిగ ఉద్యోగుల సమన్వయ కమిటీ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. అధికార దుర్వినియోగానికో మూటలు సంపాదించుకోవడానికో రాజకీయాల్లోకి రాలేదని చెప్పుకొచ్చారు.

**మాదిగల హక్కులకు చట్టబద్ధత కల్పిస్తాం :** భవిష్యత్తులో మాదిగ, మాదిగ ఉపకులాల హక్కులకు చట్టబద్ధత కల్పిస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి - మిగతా 2 లో

సూర్య ఉదయం
ప్రతి పదం... ప్రజా శ్రేయస్కరం
తెలుగు దిన పత్రిక
శనివారం 07 - 03 - 2026

# సంపాదకీయం


## అంతరిస్తున్న ఉమ్మడి కుటుంబాలు పునర్జీవానికి మార్గాలు



ఒకప్పుడు ఉమ్మడి కుటుంబం అంటే భద్రత, ధైర్యం, ఆనందం, పంచుకోవడం, సహకారం, సంస్కారం. ఇంట్లో పెద్దలు మార్గదర్శకులుగా ఉండడం, చిన్నవారికి జీవితమార్గం అయ్యేది కష్టం వచ్చినా ఒంటరితనం తెలియదు "మేమున్నాం" అనే బలమైన ధైర్యం ఉండేది. నేడు సాంకేతిక అభివృద్ధితో మనిషి దగ్గరవ్వాల్సిన బదులు మరింత దూరమవుతున్నాడు. సౌకర్యం పెరిగింది, సంస్కారం తగ్గింది. స్వేచ్ఛ పెరిగింది, బాధ్యత తగ్గింది. సంబంధాలు ఉన్నాయి, అనుబంధం లేదు. నేను, నా కుటుంబం అనే సంకుచిత భావన మన కుటుంబం, మన బంధాలు అనే విశాల దృష్టిని మింగేసింది. మనిషిలో పెరిగిన ఈర్ష్యాద్వేషాల వలననే ఉమ్మడి కుటుంబాలు అంతరిస్తున్నాయి, రేపటి తరాలు ఉమ్మడి కుటుంబాలు ఉండేవి అని పుస్తకాలలో మాత్రమే చదువుకుంటారు. ఒకప్పుడు మన కుటుంబం, మన బంధువులు అనేవాళ్లు. ఇప్పుడు నా కుటుంబం, నా పిల్లలు అంటున్నారు, రేపటి రోజులో ఎవ్వరికి వాళ్లే, భార్య మాట వినని భర్త, భర్త మాట వినని భార్య, తల్లిదండ్రుల మాట వినని పిల్లలు. ఉమ్మడి కుటుంబంలో ఒకరికి కష్టం వచ్చినా, ఆపద కలిగినా, మరేదైనా విపత్కర పరిస్థితి ఎదురైనా అందరు ఒక్కటిగా ఉండి భరోసా నింపేవాళ్లు, మేము ఉన్నాము అనే ధైర్యాన్ని అందించేవాళ్ళు, ఒకప్పుడు గోడలు చిన్నవైనా మనసులు ఆకాశంలా విస్తారంగా ఉండేవి. నేడు గోడలు ఆకాశాన్ని తాకుతున్నా మనసులు సంకుచితమై, తలుపులు మూసుకున్నాయి, హృదయాలు తాళం వేసుకున్నాయి. ఒక్కప్పుడు మాటలు మిఠాయిలా ఉండేవి, నవ్వులు దీపాల్లా వెలిగేవి, కలిసి తిన్న అన్నంలో అనుబంధ రుచి ఉండేది. నేడు ఆధునిక సౌకర్యాల మధ్య ఒంటరితనం, నిశ్శబ్దం, దూరం పెరిగింది. ఇల్లు పెద్దదయ్యింది కుటుంబం చిన్నదయ్యింది. ఆధునిక సౌకర్యాలు పెరిగాయి, అనుబంధాలు తగ్గాయి. ఒకప్పుడు పండుగలకి ఇల్లు కిక్కిరిసేది ఇప్పుడు ఫంక్షన్లకు అన్ని అద్దెకు తెచ్చుకొనే కానించేస్తునారు, మేమున్నాం అనే ధైర్యం ఉండేది అనే పరిస్థితి నుంచి నాకు సంబంధం లేదు అనే స్థాయికి వచ్చేశారు. రక్తసంబంధం ఎక్కడ ఉన్నా రక్తసంబంధమే కానీ మనస్సులే బలహీనపడ్డాయి, కుటుంబం కూలిపోవడానికి కారణం కాలం ఎంతమాత్రం కాదు, మనిషిలో పెరిగిన 'నేను' అనే అహంకారమే ఉమ్మడి కుటుంబాలు అంతరించడానికి. పర్యవసానంగా ఒంటరితనం, విభేదాలు, అసంతృప్తి, భావోద్వేగ శూన్యత. విపరీతధోరణిలు, విపరీతమైన ఆలోచనలు తగ్గించుకుంటే ఉమ్మడి కుటుంబాల వ్యవస్థకు పునరుజ్జీవనం కలిపించవచ్చు. నేను అనే నుంచి మనం అలవాటు నుంచే మొదలవ్వాలి. పెద్దలను గౌరవించడం చిన్నలతో ఓర్పుగా వ్యవహరించడం, ఉన్నది పంచుకోవడం అలవాటు చేయడం, మాటలకంటే మనసుతో మెలగడం ముఖ్యంగా "నా బాధ్యత" అనే భావన పెంచడం, ఇవన్నీ మనం తిరిగి అలవాటు చేసుకుంటే ఉమ్మడి కుటుంబాల విలువ తిరిగి వెలుగులోకి వస్తుంది.

డాక్టర్. వై. సంజీవ కుమార్,
ఫౌండర్ & ప్రెసిడెంట్, స్కై ఫౌండేషన్,
9393613555, 9493613555.

# ఏపీలో 13 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా నిషేధం



మంత్రి లోకేశ్: ఇటీవల దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో పిల్లలు సోషల్ మీడియా వినియోగించడంపై మంత్రి నారా లోకేశ్

**మొదటిపేజీ తరువాయి** - ఉపయోగించకుండా నిషేధం విధించనున్నట్లు వెల్లడించారు. ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో సీఎం చంద్రబాబు మాట్లాడారు. 13 ఏళ్ల లోపు వారికి సంబంధించి సోషల్ మీడియా బ్యాన్ చేస్తే బాగుంటుందని ఆ వయసు లోపు వారికి సోషల్ మీడియా అందుబాటులో లేకుండా చేసే కార్యక్రమానికి 90 రోజుల్లో శ్రీకారం చుడతామని స్పష్టం చేశారు. 13-16 ఏళ్లలోపు వారికి సంబంధించి ఏం చేయాలన్నదానిపై అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. సోషల్ మీడియా వల్ల మన పిల్లలు నష్టపోకూడదని. దానికి ఈ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని సీఎం స్పష్టం చేశారు. టెక్నాలజీని వాడుకుంటే ఆయుధంగా పనిచేస్తుందని, బానిసైతే జీవితాలు నాశనమవుతాయని అన్నారు.దావోస్‌లో వెల్లడించిన అభిప్రాయాన్ని వెల్లడించారు. అలానే కొద్ది రోజుల క్రితం సచివాలయంలో నిర్వహించిన మంత్రులు, కార్యదర్శుల సదస్సులో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ బాలబాలికలు సోషల్ మీడియా వినియోగించకుండా నియంత్రించేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని స్పష్టం చేశారు. సోషల్ మీడియా వినియోగంపై ప్రత్యేక చట్టం తీసుకొస్తామని ప్రకటించారు. సోషల్ మీడియా అడ్డం పెట్టుకుని అసభ్య దూషణలతో వ్యక్తిత్వ హననానికి పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. గతంలో అసభ్య పదజాలంతో రెచ్చిపోయిన వారిని వదిలిపెట్టకుండా నియంత్రించగలిగామని గుర్తు చేస్తూ మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలని, ఏపీని అత్యంత సురక్షిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబు సూచించారు.

## గత హయాంలో ఆర్థిక విధ్వంసం వల్ల రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి



**మొదటిపేజీ తరువాయి** - దాదాపు 30 ఏళ్లు వెనక్కి వెళ్లిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన రూ.3.32 లక్షల కోట్ల బడ్జెట్, ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్షలకు ప్రతిరూపమని ఆయన కొనియాడారు. ఇన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా, సామాజిక భద్రతా పెన్షన్ల కోసమే రూ. 33 వేల కోట్లు కేటాయించడం సీఎం చంద్రబాబు సాహసోపేతమైన నిర్ణయమని ప్రశంసించారు.గత ప్రభుత్వ హయాంలో అనాలోచిత విద్యుత్ కొనుగోళ్ల వల్ల డిస్కంలకు రూ. 12,250 కోట్ల నష్టం వాటిల్లిందని, విద్యుత్ సంస్థలు రూ. 1.29 లక్షల కోట్ల నష్టాల్లో కూరుకుపోయాయని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 'ట్రూడౌన్' పేరిట ఛార్జీలు తగ్గించి ప్రజలకు ఉపశమనం కలిగించామని పవన్ చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం రూ. 9 లక్షల కోట్ల అప్పులను, రూ. 35 వేల కోట్ల పెండింగ్ బిల్లులను వదిలి వెళ్లిందని విమర్శించారు. ఇందులో ఇప్పటికే రూ. 25 వేల కోట్ల బకాయిలను తమ ప్రభుత్వం చెల్లించిందని స్పష్టం చేశారు.గత ప్రభుత్వం రాష్ట్ర వాటా నిధులు ఇవ్వకపోవడం వల్ల రూ. 8,700 కోట్ల కేంద్ర నిధులు నిరుపయోగమయ్యాయని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం రూ. 7 వేల కోట్లు కేటాయించి ఇంటింటికీ మంచినీరు అందించే ప్రాజెక్టును వేగవంతం చేస్తోందని వివరించారు. "నేను నాటిన చెట్ల ఫలాలు నా కోసం కాదు.. భావితరాల కోసం" అన్న రవీంద్రనాథ్ ఠాగూర్ సూక్తిని ఉటంకిస్తూ, బడ్జెట్‌లో భావితరాల బాగు కోసం సీఎం చంద్రబాబు మంచి నిర్ణయాలు తీసుకున్నారని కొనియాడారు.

## కర్ణుడిలా నేనూ మిత్రధర్మానికి కట్టుబతా



**మొదటిపేజీ తరువాయి** - అన్నారు. మీరు బాధ్యతతో వ్యవహరిస్తేనే అనుకున్న న్యాయాన్ని చేయగలుగుతానని చెప్పుకొచ్చారు. ఎస్సీ, ఎస్టీ,బీసీలకు సంక్షేమ ఫలాలు అందించాలనేదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రగతి ప్రణాళికలో నిర్లక్ష్యంగా ఉండవద్దని అధికారులకు సూచించారు. మీ సమస్యలు పరిష్కరించేటప్పుడు అడ్డుకునే వారిని మీరే నిలువరించాలంటూ ఉద్వేగపూరిత ప్రసంగం చేశారు.

**విద్యకు మా ప్రభుత్వం పెద్దపీట వేసింది :** అట్టడుగు స్థాయిలో ఉన్న మాదిగ, ఉపకులాల అభివృద్ధే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. 'ప్రజా ప్రభుత్వం-ప్రగతి ప్రణాళిక' పేరుతో చేపట్టిన 99 రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమావేశంలో పాల్గొన్న ఉద్యోగులకు పిలుపునిచ్చారు. రాష్ట్రాభివృద్ధికి అందరూ ముందుండాలన్న సీఎం అందుకు విద్య కీలక పాత్ర పోషిస్తుందని చెప్పుకొచ్చారు. విద్యకు తమ ప్రభుత్వం పెద్దపీట వేసిందని, అందరూ చదువుకుని అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ జయంతిలోపు మాదిగల సమస్యలు తీర్చేందుకు నిధులిస్తామని, నివేదికలు సిద్ధం చేయాలని సీఎస్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

# విపక్షం లేకున్నా ప్రజల కోసమే చర్చలు



**మొదటిపేజీ తరువాయి** - ఐదు కోట్ల మంది ప్రజల భవిష్యత్తుకు భరోసా ఇచ్చేలా అర్థవంతమైన చర్చలు జరిగాయని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాల ముగింపు సందర్భంగా సభలో ఆయన ప్రసంగిస్తూ.. ప్రత్యర్థి పార్టీ సభకు గైర్హాజరై ప్రజా సమస్యలను గాలికొదిలేసినప్పటికీ, తాము మాత్రం ప్రజల ఆకాంక్షలే అజెండాగా ముందుకు సాగామని తెలిపారు. భావితరాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కీలక నిర్ణయాలు తీసుకున్నామన్నారు.రాష్ట్ర విభజన కష్టాలకు తోడు, గత పాలకుల విధ్వంస పాలన వల్ల తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌ను ఇప్పుడు ఇటుక ఇటుక పేర్చి పునర్నిర్మాణం చేసుకోవాల్సి వస్తోందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్డీయే కూటమి పక్షాలన్నీ పూర్తి సఖ్యతతో ఉన్నాయని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ప్రధాని నరేంద్ర మోదీ సంపూర్ణ సహకారంతో రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నామని వివరించారు. గత ఎన్నికల్లో కూటమి నిలబెట్టిన అభ్యర్థుల్లో 94 శాతం మందిని ప్రజలు గెలిపించారని, ఇది తమపై జనం పెట్టుకున్న నమ్మకానికి నిదర్శనమని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.3.32 లక్షల కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టి, అభివృద్ధి, సంక్షేమాలను సమన్వయం చేస్తున్నామన్నారు. ప్రతిపక్షం తీరుపై సీఎం తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే సభకు వస్తామని చెప్పడం రాజ్యాంగ విరుద్ధమని, ప్రజలు ఓట్లు వేస్తేనే అధికారం లేదా ప్రతిపక్ష హోదా వస్తాయని హితవు పలికారు. బాధ్యత గల పార్టీగా సభకు వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడకుండా తప్పించుకు తిరుగుతున్నారని విమర్శించారు. గడచిన 20 నెలల పాలనలో ఎన్నో కష్టాలను అధిగమించామని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ 'సూపర్ సిక్స్' హామీలను అమలు చేసి సూపర్ హిట్ చేశామని సగర్వంగా ప్రకటించారు. రాష్ట్రాన్ని సంక్షోభం నుంచి సంక్షేమం వైపు, విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తున్నా మన్నారు.గత ప్రభుత్వం కేంద్ర నిధులను, పథకాలను నిర్వీర్యం చేసిందని చంద్రబాబు ధ్వజమెత్తారు. 92 కేంద్ర ప్రాయోజిత పథకాల్లో 85 పథకాలు నిధుల మళ్లింపు వల్ల నిర్వీర్యం అయిపోయాయని గణాంకాలతో సహా వివరించారు. ముఖ్యంగా 'జల్ జీవన్ మిషన్' కింద రాష్ట్రానికి రూ.85 వేల కోట్లు రావాల్సి ఉండగా, గత పాలకులు కేవలం రూ.25 వేల కోట్లకే ప్రతిపాదనలు పంపి, చివరకు రూ.2500 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ పథకానికి జీవం పోశామని, ఇంటింటికీ కుళాయి ద్వారా నీరందించేందుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీసుకుంటున్న చొరవ అభినందనీయమని కొని యాడారు. ప్రజలకు సుపరిపాలన అందించేందుకు తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## కొన్ని దేశాలు మధ్యవర్తిత్వానికి ప్రయత్నిస్తున్నాయి

**మొదటిపేజీ తరువాయి** - అమెరికా, ఇజ్రాయెల్ దాడులతో పశ్చిమ ఆసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ.. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ హత్య తర్వాత తీవ్రతరమైన ఉద్రిక్తతలను తగ్గించేందుకు "కొన్ని దేశాలు మధ్యవర్తిత్వ ప్రయత్నాలు ప్రారంభించాయి" అని ఆయన శుక్రవారం ప్రకటించారు. ప్రాంతీయ శాంతికి తాము కట్టుబడి ఉన్నామని, అయితే ఇరాన్ ప్రజల శక్తిని తక్కువగా అంచనా వేసిన వారికి ఈ మధ్యవర్తిత్వం సరైన సమాధానం కావాలని ఆయన 'ఎక్స్' వేదికగా స్పష్టం చేశారు. తమ దేశ గౌరవాన్ని, సార్వభౌమత్వాన్ని కాపాడుకునే విషయంలో వెనక్కి తగ్గేది లేదని ఆయన తేల్చిచెప్పారు.అధ్యక్షుడి ప్రకటన ఒకవైపు ఉండగా.. క్షేత్రస్థాయిలో ఇరాన్ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఇజ్రాయెల్ లక్ష్యంగా ఇరాన్ తన అత్యంత శక్తివంతమైన 'ఖొర్రమ్‌షహర్-4' బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిందని తస్నీమ్ వార్తా సంస్థ వెల్లడించింది. "ఆపరేషన్ ట్రూ ప్రామిస్-4"లో భాగంగా 22వ విడత దాడులు మొదలయ్యాయని, ఇవి నేరుగా ఇజ్రాయెల్ భూభాగంపై విరుచుకుపడుతున్నాయని ఇస్లామిక్ రెవెల్యూషన్ గార్డ్ కోర్ (ఐఆర్ జీసీ) తెలిపింది. మరోవైపు, లెబనాన్‌లోని సిడాన్ నగరంలో శుక్రవారం మధ్యాహ్నం ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో ఓ నివాస భవనం దెబ్బతిన్నట్లు జిన్హువా వార్తా సంస్థ నివేదించింది.మరోవైపు, ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా అమెరికా చేపట్టిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'ని మరింత ఉధృతం చేస్తున్నట్లు అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ ప్రకటించారు. ఫ్లోరిడాలోని టాంపాలో ఉన్న సెంట్రల్ కమాండ్ ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఇరాన్ నావికాదళాన్ని, క్షిపణి కేంద్రాలను తమ దళాలు సమర్థంగా అడ్డుకున్నాయని తెలిపారు. "మేము ఈ పోరాటానికి సిద్ధంగా ఉన్నాం, విజయం సాధించే దిశగా వెళ్తున్నాం" అని ఆయన వ్యాఖ్యానించారు.

## హోర్ముజ్ జలసంధిలో భారత నౌకలకు ఆటంకం కలిగించడం లేదు

**మొదటిపేజీ తరువాయి** - హోర్ముజ్ జలసంధిలో భారతీయ చమురు నౌకల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలిగించడం లేదని ఇరాన్ స్పష్టం చేసింది. ఇరాన్ డిప్యూటీ విదేశాంగ మంత్రి సయీద్ ఖతిబ్‌జాదే ఒక అంతర్జాతీయ మీడియా సంస్థతో మాట్లాడుతూ, భారత నౌకలను తాము అడ్డుకుంటున్నట్లు వస్తున్న వార్తలను తోసిపుచ్చారు. అదే సమయంలో హిందూ మహాసముద్రంలో ఇరాన్ నౌకలపై జరుగుతున్న దాడుల విషయంలో భారత్ చొరవ తీసుకోవాలని, ఈ దాడులకు కారణమైన అమెరికాను ప్రశ్నించాలని ఆయన సూచించారు.హోర్ముజ్ జలసంధిలో స్థిరత్వం కోసం ఇరాన్ నిరంతరం ప్రయత్నిస్తుందని, ఒకవేళ ఆ జలసంధిని మూసివేయాల్సి వస్తే తామే అధికారికంగా ప్రకటిస్తామని తెలిపారు. ప్రస్తుతానికి అలాంటి ఉద్దేశం లేదని, తమది బాధ్యతాయుతమైన దేశమని స్పష్టం చేశారు. అంతర్జాతీయ జలాల్లో అమెరికా తీరు ప్రమాదకరంగా ఉందని, ఆ దేశపు "ఫుట్‌బాల్ మెంటాలిటీ" (దూకుడు స్వభావం) వల్ల సమస్యలు తలెత్తుతున్నాయని విమర్శించారు. భారత్, ఇరాన్ దేశాలు "చదరంగం" ఆడే మనస్తత్వం కలవని, అంటే దౌత్యపరమైన ఆలోచనలతో, వ్యూహాత్మకంగా సమస్యలను పరిష్కరించుకుంటాయని ఆయన అభివర్ణించారు. ఉద్రిక్తతలను తగ్గించుకోవడానికి దౌత్యమే సరైన మార్గమని, వివాదాలను చర్చల ద్వారానే పరిష్కరించుకోగలమని ఆయన అభిప్రాయపడ్డారు.

## హైదరాబాద్ వాతావరణ కేంద్రం కార్యాలయానికి బాంబు బెదిరింపు

**మొదటిపేజీ తరువాయి** - హైదరాబాద్ బేగంపేటలోని వాతావరణ కేంద్రం కార్యాలయానికి బెదిరింపు మెయిల్ వచ్చింది. కార్యాలయంలో 14 బాంబులు పెట్టామని, అవి మధ్యాహ్నం పేలుతాయంటూ ఆ మెయిల్‌లో హెచ్చరించారు. తనిఖీలు చేపట్టిన బాంబు స్క్వాడ్ ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని నిర్ధారించింది. హైదరాబాద్‌లో బాంబు బెదిరింపులు రావడం ఇటీవలి కాలంలో ఎక్కువైంది. శంషాబాద్ విమానాశ్రయం, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలకు పలుమార్లు బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈరోజు ఉదయం వాతావరణ శాఖకు బెదిరింపు మెయిల్ రావడం కలకలం రేపింది. అప్రమత్తమైన సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. సిబ్బందిని బయటకు పంపించి బాంబు స్క్వాడ్ తనిఖీలు చేపట్టింది. ఈ బెదిరింపు మెయిల్ ఫేక్ అని తేల్చింది.

# దేశానికి మార్చి చివరికల్లా నక్సలిజం నుంచి విముక్తి



**మొదటిపేజీ తరువాయి** - నక్సల్స్‌రహితంగా మారుతుంది. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి నుంచి నేపాల్‌లోని పశుపతి వరకు రెడ్ కారిడార్ ఏర్పాటు చేయాలని కలలు కన్నవారిని భద్రతాదళాలు పూర్తిగా ఓడించి తమ ఆధిపత్యం చాటుకోనున్నాయి. ప్రధాని మోదీ సారథ్యంలో భద్రతాదళాలకు ఇది అతిపెద్ద విజయం కానుంది."2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ మారాలంటే అంతర్గత భద్రత చాలా కీలకమని అమిత్ షా పేర్కొన్నారు. దేశంలోని కీలక ప్రాంతాల్లో సీఐఎస్ఎఫ్ దళాలు పటిష్ఠ భద్రతను కల్పిస్తూ ఆర్థిక అభివృద్ధికి సహకరిస్తున్నాయని చెప్పారు. దేశంలోని వివిధ జలాశయాలు, పరిశ్రమలు, విమానాశ్రయాలు, పార్లమెంట్ వంటి ముఖ్యమైన ప్రాంతాలకు రక్షణను అందిస్తున్నాయని చెప్పారు. అయితే, దేశంలో శాంతి వాతావరణం నెలకొన్నప్పుడే ఆర్థిక వృద్ధి సాకారమవుతుందని షా చెప్పుకొచ్చారు. అదేవిధంగా, దేశాన్ని ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దాలంటే పరిశ్రమల అభివృద్ధి అవసరమని షా నొక్కి చెప్పారు. అయితే, ఆ బాధ్యతను సీఐఎస్ఎఫ్ సమర్థంగా నిర్వహిస్తోందని పేర్కొన్నారు.ఇదిలా ఉండగా, సీఐఎస్ఎఫ్ స్థాపించి 56 ఏళ్లు పూర్తైన సందర్భంగా ఆ దళాలు సాధించిన పురోగతిని అమిత్ షా ప్రశంసించారు. సీఐఎస్ఎఫ్ చిన్న స్థాయిలో ప్రారంభమై, ప్రస్తుతం పారిశ్రామిక భద్రత రంగంలో అగ్రస్థానానికి చేరుకుందని కొనియాడారు. దేశ చరిత్రలో ధైర్యం, త్యాగం, అంకితభావంతో ఈ దళం ప్రతి సవాల్‌ను సమర్థంగా ఎదుర్కొందని, దృఢ సంకల్పాన్ని ప్రదర్శించిందని పేర్కొన్నారు. సీఐఎస్ఎఫ్ లేకుండా దేశ పారిశ్రామిక అభివృద్ధి దార్శనికతను ఊహించలేమన్నారు. మరోవైపు, దేశంలోని అన్ని ఓడరేవుల భద్రతా బాధ్యతలను సీఐఎస్ఎఫ్‌కు అప్పగించాలని ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో ప్రైవేట్ పరిశ్రమలకు కూడా హైబ్రిడ్ విధానంలో భద్రత అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.అదేవిధంగా, 2047 నాటికి భారతదేశాన్ని పూర్తిగా అభివృద్ధి చెందిన దేశంగా మార్చడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు అమిత్ షా. ప్రపంచవ్యాప్తంగా ప్రతి రంగంలోనూ అగ్రస్థానాన్ని సాధించడం, అలాగే 2027 నాటికి దేశాన్ని ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలపడం, అనే ఈ తీర్మానాలను ప్రధానమంత్రి ప్రజల ముందు ఉంచారని ఆయన ఎత్తి చూపారు.ఇదిలా ఉండగా, వివిధ ప్రజా కార్యక్రమాల్లో పాల్గొనడానికి శుక్రవారం ఒడిశాకు చేరుకున్న అమిత్ షాకు, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ భువనేశ్వర్ విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం భువనేశ్వర్‌లో రూ.890 కోట్ల ఖర్చుతో నిర్మించనున్న రెండు నివాస ప్రాజెక్టులను ప్రారంభించారు. దాంతో పాటు మూడు రిజర్వ్ బెటాలియన్‌లకు షా శంకుస్థాపన కూడా చేశారు. ఈ కార్యక్రమంలో ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ, అసెంబ్లీ స్పీకర్ సురామ పాఢీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఇది ఉత్తి దండగ ప్రచార పర్వం



**మొదటిపేజీ తరువాయి** - రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'పై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వం తాజాగా ప్రకటించిన 99 రోజుల యాక్షన్ ప్లాన్ కేవలం ఉత్తి దండగ ప్రచార పర్వమని, ఇది ప్రజలను మభ్యపెట్టే మరో నాటకమని ఆయన ఎద్దేవా చేశారు. దాదాపు 800 రోజుల పాలనలో (రెండున్నరేళ్లు) చేసిందేమీ లేక, ఇప్పుడు ప్రజల దృష్టిని మరల్చేందుకే రేవంత్ రెడ్డి సర్కార్ ఈ కొత్త డ్రామాకు తెరతీసిందని ఆరోపించారు.గతంలో రెండుసార్లు నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజల నుంచి స్వీకరించిన లక్షలాది దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోక ఇంకా చెత్తబుట్టల్లోనే మగ్గుతున్నాయని హరీశ్ రావు విమర్శించారు. ఆ దరఖాస్తులకే దిక్కులేదని, ఇప్పుడు మళ్లీ పది వారాల పాటు పది రకాల కార్యక్రమాలంటూ ప్రజలను మోసం చేయడం సిగ్గుచేటన్నారు. అమలుకు నోచుకోని ఆరు గ్యారెంటీలు, పాలనా వైఫల్యాలు, కోట్లు కొల్లగొట్టేందుకు చేసిన స్కాముల నుంచి తప్పించుకునేందుకే ఈ 'డైవర్షన్ ప్లాన్' రచించారని మండిపడ్డారు. మీ పాలనలో సగం కాలం పూర్తయినా ఇంకా ఎన్ని రోజులు ప్రచారాలతో నెట్టుకొస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.రాష్ట్రంలో రైతుల దయనీయ స్థితిని ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. పంట కోతల సమయం వచ్చినా ఈ సీజన్ రైతు భరోసా ఇవ్వలేదని, గత సీజన్ పంట బోనస్ ఎగ్గొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం యూరియా కూడా సరఫరా చేయలేక అన్నదాతలను నడిరోడ్డు మీదకు ఈడ్చారని, నమ్మించి గొంతుకోసిన ఈ మోసాల గురించి ఇప్పుడు గ్రామసభల్లో రైతులకు ఏం సమాధానం చెబుతారని నిలదీశారు.అలాగే యువతకు మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేశారని, జాబ్ క్యాలెండర్‌ను 'జాబ్ లెస్' క్యాలెండర్‌గా మార్చేశారని దుయ్యబట్టారు. మూసీ సుందరీకరణ పేరుతో లూటీకి ప్రాధాన్యత ఇస్తూ, నోటిఫికేషన్లను గాలికి వదిలేశారని విమర్శించారు. రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు మూలనపడ్డాయని, ఇప్పుడు నైపుణ్య శిక్షణ అంటూ కొత్త పాట పాడుతున్నారని ఎద్దేవా చేశారు.ఆరోగ్యం, విద్య, గ్రామీణా భివృద్ధి అంటూ ప్రభుత్వం పేర్లు గొప్పగా చెబుతున్నా వాస్తవా నికి ఆసుపత్రుల్లో మందులు లేక, బడుల్లో వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని హరీశ్ రావు గుర్తుచేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్లను క్లియర్ చేయడం, పారిశుద్ధ్యం నిర్వహించడం కనీస బాధ్యత అని, దానిని కూడా ఒక ఈవెంట్‌లా మార్చుకోవడం, గొప్పగా చెప్పుకోవడం ఈ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. సోలార్ విద్యుత్, పర్యావరణం, డ్రగ్స్ నియంత్రణ వంటి అంశాలన్నీ కేవలం పత్రికల్లో పబ్లిసిటీ కోసమే తప్ప, ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని స్పష్టం చేశారు. పాలనను గాలికి వదిలి పబ్లిసిటీ గారడీలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు గ్రామ గ్రామాన ప్రజలు సిద్ధంగా ఉన్నారని హరీశ్ రావు హెచ్చరించారు.

# త్వరలో తెలంగాణలో రాజకీయ పార్టీని స్థాపిస్తున్నా



**మొదటిపేజీ తరువాయి** - త్వరలో తెలంగాణలో రాజకీయ పార్టీని స్థాపించనున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తిరుమలలో వెల్లడించారు. తన భర్తతో కలిసి కవిత శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్నారు. వేకువజామున శ్రీవారి అభిషేక సేవలో పాల్గొన్నారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వారికి ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.అనంతరం కవిత మాట్లాడుతూ, నాలుగేళ్లుగా తాను పడుతున్న మనోవేదన వెంకటేశ్వరస్వామి వారి దయతో తీరిందని అన్నారు. ఢిల్లీ మద్యం కేసులో కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడంతో శ్రీవారి మొక్కులు చెల్లించడానికి కాలినడకన వచ్చానని తెలిపారు. కవిత నిన్న రేణిగుంట విమానాశ్రయం చేరుకుని, అక్కడి నుంచి తిరుపతి చేరుకున్నారు. ఆ తర్వాత అలిపిరి నుండి కాలినడకన తిరుమలకు చేరుకున్నారు.

సూర్య ఉదయం
ప్రతి పదం.. ప్రజా శ్రేయస్సు
తెలుగు దిన పత్రిక
శనివారం 07 - 03 - 2026

# రైతన్నలకు గుడ్‌న్యూస్ - యూరియా యాప్‌లో మార్పులు!

**మండలానికి లేదా నియోజకవర్గానికి ఒక యూనిట్‌గా యూరియా పంపిణీ**

**సరిగా పంపిణీ చేయని డీలర్లపై నిఘా**

**జిల్లాల వారీగా సమస్యలపై విశ్లేషణ**

**సులువుగా యూరియా యాప్ వినియోగించేలా చర్యలు**



రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. గత ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్ర రైతాంగం యూరియా కోసం అష్టకష్టాలు పడిన విషయం తెలిసిందే. అయితే గతంలో యూరియా గోదాముల వద్ద గొడవలు, రైతులపై పోలీసుల కఠిన వైఖరిపై తీవ్ర విమర్శలొచ్చాయి. ఇలాంటి సమస్యలు భవిష్యత్తులో తలెత్తకూడదని రాష్ట్ర ప్రభుత్వం యూరియా కోసం ప్రత్యేకంగా ఓ యాప్‌ను విడుదల చేసింది. దీనిలో పలు లోపాలు తలెత్తడంతో వాటిని అరికట్టి దీనిని మరింత మెరుగుపరిచేలా, రైతుల కష్టాలకు చెక్ పెట్టేలా ప్రభుత్వం కసరత్తులు చేస్తోంది. దీనితో పాటు మండలానికి ఓ యూరియా పంపిణీ యూనిట్ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది.

**డీలర్లపై నిఘా :** తెలంగాణ వ్యాప్తంగా యూరియా పంపిణీ చేసేందుకు ఇటీవల ప్రత్యేక యాప్‌ను ప్రారంభించిన సంగతి తెలిసిందే. దీనిని మరింత సులభతరం చేసేందుకు, దీనిలో మరిన్ని మార్పులు చేర్పులు చేయాలని వ్యవసాయ శాఖ నిర్ణయించింది. ప్రస్తుతం జిల్లా యూనిట్‌గా యూరియా పంపిణీ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ స్థానంలో ఒకటి లేదా రెండేసి మండలాలను ఒక యూనిట్‌గా లేదా నియోజకవర్గాన్ని యూనిట్‌గా చేసి పంపిణీ చేయాలని ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. యూరియా పంపిణీ సరిగా చేయని ప్రైవేట్ డీలర్లపై నిఘా పెట్టింది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు చర్యలు చేపడుతున్నారు.

**సులువుగా వినియోగించేలా చర్యలు :** యూరియా పంపిణీని సులభతరంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఓ ప్రత్యేక యాప్‌ను తీసుకొచ్చింది. అయితే దీనిని వినియోగించే సందర్భంలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయని పలు జిల్లాల్లో ఫిర్యాదులు వచ్చాయి. దీనిలో సరిగా బుకింగ్ కావడం లేదని, స్లాట్‌లు ముగిసిపోతున్నాయని, దుకాణానికి వెళ్లేసరికే నిల్వలు నిండుకోవడం, ఇతర సమస్యలు ఎదురవుతున్నాయని రైతులు అంటున్నారు. దీంతో మంగళవారం జిల్లా కలెక్టర్ల సదస్సు సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి యూరియా యాప్ గురించి ప్రస్తావించారు. సులువుగా వినియోగించేలా చర్యలు తీసుకురావాలని తెలిపారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ అధికారులు బుధ, గురువారాల్లో జిల్లాల వారీగా సమస్యలపై సమాచారం సేకరించి విశ్లేషణ చేశారు.

**జిల్లా యూనిట్‌గా ఉండటం వల్లే ఈ సమస్య :** ప్రస్తుతం యూరియా యాప్ వినియోగంతో జిల్లా యూనిట్‌గా పంపిణీ నిర్వహిస్తున్నారు. రైతులు ఈ యాప్‌లో తమ జిల్లాల పరిధిలోని ఎరువుల దుకాణాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో యూరియా కోసం బుకింగ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో రద్దీ ఏర్పడుతోంది. ముందుగా యూరియా కేంద్రాలకు వచ్చిన వారికే లభిస్తోంది. దీంతో పాటు నిల్వలపై ఎప్పటికప్పుడు తాజా సమాచారం నమోదు కావడం లేదు. ప్రైవేట్ డీలర్లు కూడా యాప్ వినియోగానికి సహకరించడం లేదని తెలిసింది.

**నియోజకవర్గం యూనిట్‌గా యూరియా పంపిణీ :** ఈ సమస్యలన్నింటినీ దృష్టిలో పెట్టుకుని వ్యవసాయ శాఖ ఓ నిర్ణయానికి వచ్చింది. జిల్లా యూనిట్ల స్థానంలో ఇకపై రైతులకు అందుబాటులో ఉండే మండల కేంద్రాలు ఒకటి లేదా రెండింటిని కలిపి ఒక యూనిట్‌గా చేసి యూరియాను సరఫరా చేయాలని భావిస్తోంది. సంబంధిత ప్రాంతాల్లో ఎరువుల దుకాణాలు, సహకార సంఘాలు తక్కువగా ఉంటే నియోజకవర్గం యూనిట్‌గా యూరియాను పంపిణీ చేయాలని ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. వివిధ రకాల సాంకేతిక సమస్యల నివారణకు యాప్‌లో మార్పులు చేయనుంది. డీలర్లు యాప్ ద్వారా యూరియా పింపిణీకి సహకరించేలా త్వరలో వారితో సమావేశం నిర్వహించాలని వ్యవసాయ శాఖ భావిస్తోంది. దీనికోసం దుకాణాల్లో తనిఖీలు చేయాలని ఆదేశించింది.

**సాంకేతికతపై అవగాహన లేకపోవడంతో :** రైతులకు యూరియా కష్టాలు తీర్చేందుకు తీసుకొచ్చిన యాప్‌లో పలు సాంకేతిక సమస్యలను ప్రభుత్వం గుర్తించింది. దీనిని మరింత సమర్థంగా వినియోగించేందుకు అడుగులు వేస్తోంది. అయితే పల్లెల్లో రైతులకు సాంకేతికతపై అంతగా అవగాహన లేకపోవడం సమస్యగా మారింది. దీనితో పాటు అనేక మంది స్మార్ట్ ఫోన్లు వినియోగించడం లేదు. ఈ సమస్యలకు అనుగుణంగా నూతన విధానం తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

# టోలీచౌకిలో నిర్మాణ పనుల్లో ప్రమాదం

**ఏడంతస్తుల భవనం పైనుంచి పడి ఇద్దరు కార్మికుల మృతి**

**హైదరాబాద్ టోలీచౌకిలో తీవ్ర విషాదం**

**భవన నిర్మాణ పనుల్లో ప్రమాదం, ఇద్దరు కార్మికులు మృతి**

**గోడ కూలి ఇటుకలు, గోవా కర్రలు మీద పడటంతో కార్మికులకు తీవ్ర గాయాలు**



భవనం ఏడో అంతస్తులో పనులు చేపడుతుండగా రెయిలింగ్ పిట్టగోడ, గోవా కర్రలు కూలిపోయిన ఘటనలో ఇద్దరు కార్మికులు మృతి చెందారు. మరో ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన హైదరాబాద్‌లోని టోలీచౌకిలో చోటుచేసుకుంది. వీరంతా హైదరాబాద్‌లోని టోలీచౌకి నిజాం కాలనీలో ఆరాఫత్ ఏడంతస్తుల భవనం నిర్మిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన గుడిమల్కాపూర్ హీరానగర్‌లో నివసించే మేస్త్రీలు దోమన ఆదినారాయణ (50), మచ్చ తిరుపతిరావు (41), ఆర్.రమేశ్ (29), ఒడిశాకు చెందిన ఎం.రమేశ్ (35) ఏడో అంతస్తులో గోవా కర్రలు కట్టి రెయిలింగ్‌కు పిట్టగోడ పనులు చేస్తున్నారు. గురువారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో పిట్టగోడ ఉన్నట్టుండి కూలింది. గోవా కర్రలు ఊడిపోయాయి. దీంతో ఒక్కసారిగా ఈ నలుగురూ అంత ఎత్తు నుంచి రోడ్డుపై నిలిపిన ఓ ఆటోపై పడ్డారు. ఈ ఘటనలో ఆదినారాయణ అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. మరో ఇద్దరు కార్మికులతో పాటు ఆటో డ్రైవర్ లాల్ అహ్మద్ (50) గాయపడ్డారు.

**రెండుసార్లు తాఖీదులు జారీ :** ఈ భవనానికి పక్కనే మారికా హైస్కూల్ ఉంది. పాఠశాల విద్యార్థులు కాస్త ముందుగా వెళ్లడంతో ముప్పు తప్పింది. ఈ భవనానికి జడ్జీ ఇదివరకే రెండుసార్లు తాఖీదులు జారీ చేసినట్లు జీహెచ్ఎంసీ వెల్లడించింది.

**పొట్టకూటికి నగరానికి వచ్చి :** పొట్టకూటికి కుటుంబంతో పదేళ్ల క్రితం ఆదినారాయణ, అనిత, తిరుపతిరావు, రజనీ దంపతులు హైదరాబాద్ వచ్చారు. వీరు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం వీరపాడుకు చెందినవారు. ఇంటి పెద్దల మరణంతో రెండు కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారింది. తిరుపతిరావుకు లాస్య (11), కావ్య (13) కుమార్తెలు ఉన్నారు. వీరంతా స్వగ్రామంలోనే చదువుకుంటున్నారు. ఆదినారాయణకు కుమారుడు అభి (18) శ్రీకాకుళంలో డిగ్రీ చదువుతున్నాడు. నాని (16) తల్లిదండ్రులతో ఉంటూ పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్నాడు. ప్రతిరోజూ ఉదయం పిల్లలతో మాట్లాడి పనికి బయలుదేరే అలవాటుంది. ఇప్పుడు పిల్లలకు ఏం సమాధానం చెప్పాలంటూ రజని, అనిత కన్నీరుమున్నీరుగా విలపించారు.

**మంత్రి వివేక్ వెంకట స్వామి ఆరా :** టోలీచౌకి ప్రమాద ఘటనపై కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి స్పందించారు. సమాచారం తెలిసిన వెంటనే ఆయన సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలపై సమగ్ర నివేదిక సమర్పించాలన్నారు. కార్మికుల ఆరోగ్య పరిస్థితిపైనా నివేదిక ఇవ్వాలన్నారు.

**తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి పొన్నం :** టోలీచౌకి భవన ప్రమాదంపై హైదరాబాద్ ఇంఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నిర్మాణంలో ఉన్న భవన ప్రమాదంలో నలుగురు కార్మికులు మృతి చెందడం, మరో ఆరుగురికి తీవ్ర క్షతగాత్రులవ్వడం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. ఘటనకు గల కారణాలపై జిల్లా కలెక్టర్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌లతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గాయపడిన క్షతగాత్రులకు నాణ్యమైన వైద్యం అందించాలని ఆదేశించారు. మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నిర్మాణ ప్రదేశాల్లో భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించేలా అధికారులు పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని, భవిష్యత్తులో ఇటువంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు.

**ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కారాదు :** మరోవైపు ప్రమాద ఘటనపై టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని టోలీచౌకీ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఐదు అంతస్తుల భవనంలో జరిగిన ప్రమాదంలో కార్మికులు మృతి చెందడం దురదృష్టకరమమన్నారు. మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. నిర్మాణ ప్రదేశాల్లో భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించేలా అధికారులు పర్యవేక్షణను, కట్టుదిట్టం చేయాలని ఆయన అన్నారు. భవిష్యత్తులో ఇటువంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని మహేశ్‌కుమార్ గౌడ్ ఆదేశించారు.

# అమరావతి ఐఆర్‌ఆర్ కేసులో కొత్త మలుపు

**హైకోర్టులో మాజీ ఎమ్మెల్యే పిటిషన్**


**అమరావతి ఐఆర్‌ఆర్ కేసును ప్రజాప్రతినిధుల కోర్టుకు మార్చాలని పిటిషన్**

**హైకోర్టును ఆశ్రయించిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి**

**ప్రస్తుత సీఎం, మంత్రి నిందితులుగా ఉన్నందున ప్రత్యేక కోర్టులో విచారించాలని అభ్యర్థన**

**కేసుకు సంబంధించిన ఛార్జ్‌షీట్, తుది నివేదికను తనకు ఇవ్వాలని మరో పిటిషన్**

**విజయవాడ ఏసీబీ కోర్టులో విచారణపై స్టే విధించాలని కోరిన పిటిషనర్**




గత ప్రభుత్వ హయాంలో అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబుతో పాటు మరికొందరిపై నమోదైన అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్‌ఆర్) కేసు విచారణ మరో మలుపు తిరిగింది. ఈ కేసును విజయవాడ ఏసీబీ కోర్టు నుంచి ప్రజాప్రతినిధుల (ఎంపీ, ఎమ్మెల్యే) ప్రత్యేక కోర్టుకు బదిలీ చేయాలని కోరుతూ వైసీపీ మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.ప్రజాప్రతినిధులపై నమోదైన కేసులను కేవలం ప్రత్యేక కోర్టులు మాత్రమే విచారించాలని సుప్రీంకోర్టు తీర్పు ఉందని ఆళ్ల రామకృష్ణారెడ్డి తన పిటిషన్‌లో ప్రస్తావించారు. ఐఆర్‌ఆర్ కేసులో ప్రస్తుత ముఖ్యమంత్రి, ఒక మంత్రి, మాజీ ఎమ్మెల్యేలు నిందితులుగా ఉన్నారని, అందువల్ల ఈ కేసు విచారణ ప్రత్యేక కోర్టు పరిధిలోకి వస్తుందని ఆయన వాదించారు. ఈ నేపథ్యంలో విజయవాడ ఏసీబీ కోర్టులో జరుగుతున్న విచారణను నిలిపివేయాలని, కేసు తుది నివేదికను అంగీకరించకుండా స్టే ఇవ్వాలని హైకోర్టును అభ్యర్థించారు.ఇదే అంశంపై ఆళ్ల రామకృష్ణారెడ్డి హైకోర్టులో మరో పిటిషన్ కూడా దాఖలు చేశారు. ఐఆర్‌ఆర్ కేసుకు సంబంధించి సీఐడీ నమోదు చేసిన ఛార్జ్‌షీట్, తుది నివేదికలను తనకు అందజేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఆ పత్రాలు తనకు అందకపోవడం వల్లే విజయవాడ ఏసీబీ కోర్టులో ప్రొటెస్ట్ పిటిషన్ దాఖలు చేయలేకపోయానని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు.గత నెలలో ఈ కేసుపై ఏసీబీ కోర్టులో విచారణ జరిగింది. 2024లో సీఐడీ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్ వివరాలు, 2026లో కేసు ఉపసంహరణ కోసం వేసిన పిటిషన్ కాపీలను తమకు ఇవ్వలేదని ఫిర్యాదిదారు అయిన ఆళ్ల తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అభ్యంతరాలు తెలిపేందుకు గడువు కావాలని కోరగా, న్యాయస్థానం అంగీకరించి తదుపరి విచారణను మార్చి 11వ తేదీకి వాయిదా వేసింది. ఇప్పుడు హైకోర్టులో పిటిషన్లు దాఖలు కావడంతో ఈ కేసు విచారణ మరింత ఆసక్తికరంగా మారింది.

# తెలంగాణ టెన్త్ హాల్ టికెట్ల విడుదల.. మెసేజ్‌తోనూ డౌన్‌లోడ్

**మార్చి 14 నుంచి ప్రారంభం కానున్న ఎస్సెస్సీ పరీక్షలు**

**ఈసారి మెసేజ్ ద్వారా హాల్ టికెట్లు పొందే కొత్త సదుపాయం**

**అధికారిక వెబ్‌సైట్ ద్వారా కూడా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం**

**సమస్యల పరిష్కారానికి హెల్ప్‌లైన్ నంబర్ ఏర్పాటు**

తెలంగాణలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ముఖ్య గమనిక. విద్యాశాఖ గురువారం ఎస్సెస్సీ పరీక్షల హాల్ టికెట్లను విడుదల చేసింది. విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ bse.telangana.gov.in నుంచి తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.ఈసారి విద్యార్థుల సౌలభ్యం కోసం బోర్డు సరికొత్త విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. 8096958096 నంబర్‌కు మెసేజ్ పంపడం ద్వారా కూడా హాల్ టికెట్‌ను పొందే సదుపాయం కల్పించింది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మార్చి 14వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ప్రతిరోజూ ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు.హాల్ టికెట్ల డౌన్‌లోడ్‌లో ఏవైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే, విద్యార్థులు లేదా తల్లిదండ్రులు 040-23230942 నంబర్‌లో సంప్రదించి సహాయం పొందవచ్చని అధికారులు సూచించారు.




# దామోదర్ కుటుంబానికి అండగా ఉంటాం





**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్ పల్లి:** సీనియర్ వీడియో జర్నలిస్ట్ దామోదర్ కుటుంబానికి అండగా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఉంటారని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. డిసెంబర్ 5 తారీకున జీడిమెట్లలో గుండెపోటు తో మృతి చెందిన సీనియర్ వీడియో జర్నలిస్ట్ దామోదర్ మృతి చెందారు. దామోదర్ కి గుండెపోటు వచ్చిన రోజు బిఆర్ఎస్ పార్టీ తరపున ఆసుపత్రికి వెళ్లిన ఎమ్మెల్యేలు కృష్ణారావు, వివేకానంద, ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు దగ్గర ఉండి వారి కుటుంబ సభ్యులకు అండగా ఉన్నారు. దురదృష్టవశాత్తు చికిత్సకు స్పందించక మరణించిన దామోదర్ కుటుంబాన్ని గతంలో కేటీఆర్ పరామర్శించారు. దామోదర్ కుటుంబానికి అండగా ఉంటామని కేటీఆర్ హామీ ఇచ్చారు. కేటీఆర్ తన వ్యక్తిగతంగా ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయం ప్రకటించారు. శుక్రవారం కేటీఆర్ తరుపున దామోదర్ ఇంటికి వెళ్ళి కుటుంబానికి ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అందించారు. చనిపోయిన రోజున అంత్రక్రియల నిమిత్తం లక్ష రూపాయలు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అందజేశారు. దామోదర్ కుటుంబానికి భవిష్యత్తులోనూ అండగా ఉంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

# నేడు కంబదూరు గ్రామంలో చెక్పోస్టు కూడలి దగ్గర

**ప్రజల కోసం తాగు నీటి చలివేంద్రాన్ని ఏర్పాటుచేసిన ఎస్సై ఎస్. లోకేష్.......**



**సూర్యా ఉదయం తెలుగు దినపత్రిక ప్రతినిధి కంబదూరు కళ్యాణదుర్గం :** 31 వ. జన్మదినం జరుపుకుంటున్న కంబదూరుఎస్సై ఎస్. లోకేష్ గారికి కళ్యాణదుర్గం నియోజకవర్గం ప్రజలు అధికారులు ప్రజా ప్రతినిధులు తోటి ఉద్యోగులు అభిమానులు మీడియా మిత్రులు ఈరోజు జన్మదిన శుభా వేడుకలు జరుపుకుంటున్న ఎస్సై ఎస్ లోకేష్ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుకుంటున్నారు ఈ సందర్భంగా వీరందరూ దేవుని ఎస్సై ఎస్.లోకేష్. గారికి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలు ఐశ్వర్యాలు సమకూర్చాలని ఆశీర్వదించాలని భగవంతున్ని కోరుకుంటున్నారు. ఈరోజు కంబదూరుపోలీస్ స్టేషన్ ఆవరణంలో ఎస్సై ఎస్ లోకేష్ గారిపుట్టిన రోజు సందర్భంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగినది. ఈ సందర్భంగా అనంతపురం ట్రైనీ ఐపీఎస్ అధికారులు. కళ్యాణదుర్గం డిఎస్పి రవిబాబు. రూరల్ సిఐ నీలకంఠేశ్వర. కమ్మదూరు జమీందారులు కానిస్టేబుల్స్ హోంగార్డ్స్ వివిధ పార్టీ నాయకులు స్టోర్ డీలర్లుఅభిమానుల ఈ సందర్భంలో కార్యక్రమం జయప్రదం చేశారు.

# విజ్ఞాన వారోత్సవాలో ఉపాధ్యాయులకు బహుమతి




**కౌతాళంమార్చి6(సూర్యఉదయం):** –కౌతాళం మండలంలో జిల్లా స్థాయిలో విజ్ఞాన వారోత్సవాల సందర్భంగా ఉపాధ్యాయులు సెమినార్ లో రెండవ బహుమతి భీమప్ప (సులేకెరి), మూడవ బహుమతి లింగరాజు(ఉరుకుంద), విద్యార్థుల విభాగంలో 6 వ తరగతి వైష్ణవి (ఉరుకుంద), బహుమతి పొందారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఎస్సైను కలిసిన వైసిపి నాయకులు



**సూర్య ఉదయ ప్రతినిధి : పెద్దకడబూరు** ఇటీవలే నూతనంగా బాధితులు చేపట్టిన పెద్దకడబూరు ఎస్సై మారుతి ను మండల వైసిపి నాయకులు ముక్కరన్న, ఆర్లప్ప, పూలమాల శాలువాతో సన్మానం చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఇలాంటి అవాయించిన సంఘటనలు జరగకుండా, శాంతి భద్రతలపై ప్రత్యేక నిగా ఉంచాలని ఎస్సై కు వివరించామన్నారు, గ్రామాలలో ఏవైనా సమస్యలుంటే పొలం తగదాలు గొడవలు ఇలాంటి సమస్యలు ఏమైనా ఉంటే నేరుగా స్టేషన్కు వచ్చి సమస్యను పరిష్కరించుకోవాలని కేసులు కోర్టులు చిట్టి తిరిగి జీవితాలు నాశనం చేసుకోకూడదని మండల ప్రజలకు ఆయన తెలియజేశారు ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ప్రసాద్, సుందరం, ఏసన్న, కుమార్, ముక్కరన్న పాల్గొన్నారు

# సుగుణమ్మ అంత్యక్రియల్లో సయ్యద్ బాషా



**సూర్య ఉదయం ప్రతినిధి, హైదరాబాద్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామం కొండారెడ్డి పల్లి లో వారి పిన్ని సుగుణమ్మ అంత్యక్రియల్లో రేవంత్ రెడ్డి సోదరులు తిరుపతి రెడ్డి తో కలిసి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు షేక్ సయ్యద్ బాషా పాల్గొని నివాళు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# లబ్దిదారి కందుకూరి లక్ష్మి దేవి కి సి.యం రిలీఫ్ ఫండ్



**సూర్య ఉదయ ప్రతినిధి :**

ద్వారా మంజూరైన రూ. 2,20,000/- చెక్కును కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అందజేశారు.

సూర్య ఉదయం
తెలుగు దిన పత్రిక
శనివారం 07 - 03 - 2026

## కలబందతో మెరిసే అందం మీ సొంతం ఎలా వాడాలంటే



అలోవెరాలో విటమిన్లు , ఫోలిక్ యాసిడ్, కోలిన్, %బీ1, బీ2, బీ3, బీ6, బీ%12 విటమిన్లు, కాల్షియం, మెగ్నీషియం, జింక్, క్రోమియం, సెలీనియం, సోడియం, ఐరన్, పొటాషియం వంటి దాదాపు 20 రకాల ఖనిజాలు ఉంటాయి. మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇది ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. అందుకే ఆయుర్వేదంలో కలబందకు ప్రత్యేక స్థానం ఉంది. ఎన్నో వ్యాధుల నివారణకు దీనిని ఔషధంగా వినియోగిస్తారు. కాబట్టి అలోవెరా జెల్ ప్రయోజనాలు, దానిని ఎలా ఉపయోగించాలో ఇక్కడ తెలుసుకుందాం..

**అలోవెరా జెల్‌ని ముఖానికి అప్లై చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు ఇవే..**

అలోవెరా జెల్ ముఖంపై ఫైన్ లైన్స్ సమస్య నుంచి బయటపడటానికి సులభమైన పరిష్కారం. దీన్ని చేతులు, ముఖానికి అప్లై చేయడం వల్ల చర్మంలో కొల్లాజెన్ స్థాయిలు పెరిగి చర్మం మెరుస్తుంది. దీన్ని రోజూ ముఖానికి రాసుకోవడం వల్ల చర్మం మృదువుగా, ఆరోగ్యంగా మారుతుంది.

**సూర్య కిరణాల నుంచి రక్షణ**

అలోవెరా శరీరానికి చల్లదనాన్ని ఇస్తుంది. అలోవెరా జెల్‌ను ముఖానికి అప్లై చేయడం వల్ల దద్దుర్లు, ముఖం వాపు నుండి ఉపశమనం పొందవచ్చు. దీన్ని ముఖానికి అప్లై చేయడం వల్ల సూర్యకిరణాలు చర్మంపై ప్రభావం చూపవు. బయట ఎక్కువ పని చేసే వారు ఇంటికి వచ్చిన తర్వాత అలోవెరా జెల్‌ని ముఖానికి రాసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.

### గుండె జబ్బుల బారిన పడొద్దంటే

## మీ వంటలో ఈ మార్పు తప్పక చేయండి



ఈ మధ్య కాలంలో గుండె జబ్బుల మరణాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. వీటిలో చాలా మరణాలకు రక్తంలో కొవ్వు పేరుకుపోవడమే ప్రధాన కారణం అవుతోంది. మరి రక్తంలో కొవ్వు పేరుకోకూడదు అంటే మన ఆహారపు అలవాట్లలో చాలా మార్పులు చేసుకోవాలి. ముఖ్యంగా మనం వాడే వంట నూనె విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. మన ఆరోగ్యం కచ్చితంగా మనం ఇంట్లో ఏ వంట నూనె ఉపయోగిస్తున్నాం అనే దానిపై ఆధారపడి ఉంటుంది.అదేవిధంగా నూనె రకం ఏదైనా సరే దాన్ని ఎక్కువగా వినియోగించడం కూడా మన గుండె ఆరోగ్యానికి కీడు చేస్తుంది. నూనె ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల సిరల్లో చెడు కొలెస్ట్రాల్ పరిమాణం పెరుగుతుంది. దీనివల్ల ముందుగా అధిక రక్తపోటు వచ్చి ఆ తర్వాత గుండెపోటు, గుండె వైఫల్యం, కరోనరీ ఆర్టరీ డిసీజ్, ట్రిపుల్ వెస్సెల్ డిసీజ్లకు దారి తీస్తుంది. కాబట్టి మనం వంట నూనె రకంపైన మాత్రమేగాకుండా వంటల్లో వినియోగించే నూనె మోతాదు విషయంలో కూడా జాగ్రత్తగా ఉండాలి.రక్త నాళాల్లో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడానికి కొన్ని మేలైన వంట నూనెలను మాత్రమే వినియోగించాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. నూనె విషయంలో వంటలో మార్పు చేయకపోతే అనారోగ్యాన్ని కొని తెచ్చుకున్నట్లే అవుతుందని హెచ్చరిస్తున్నారు. కొన్ని నూనెలు చెడు కొలెస్ట్రాల్‌కు చెక్ పెడతాయని, వాటిని తీసుకోవడంవల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచిస్తున్నారు. వేరుశెనగ నూనెతో కొలెస్ట్రాల్ పెరుగుతుందని అంటారు. కానీ ఇది అపోహ అని నిపుణులు అంటున్నారు.వేరుశనగ నూనెను ఉపయోగించడం ఆరోగ్యానికి మంచిది. వేరుశనగ నూనెలో విటమిన్ ఇ, ఫైటోస్టెరాల్ అధిక మొత్తంలో ఉంటాయి. అయితే అధిక రక్తపోటు, మధుమేహం లాంటి దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉన్నవాళ్లు నెలల తరబడి ఒకే నూనెను కాకుండా.. రెండు నెలలకు ఒకసారి నూనె రకాన్ని మారిస్తే బాగుంటుంది. అదేవిధంగా అవిసె గింజలలో ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. కాబట్టి అవిసె నూనెను వంటల్లో వాడితే శరీరంలో కొలెస్ట్రాల్‌తోపాటు మంట తగ్గుతుంది. అయితే అవిసె నూనెను అధిక ఉష్ణోగ్రత వద్ద మరిగించినా, ఫ్రిజ్‌లో పెట్టి కూల్ చేసినా దాని సహజ లక్షణాన్ని కోల్పోతుంది. కాబట్టి అలాంటి పొరపాటు చేయకూడదు.ఆలివ్ నూనె కూడా ఆరోగ్యానికి చాలా మంచిది. అయితే మన దేశంలో ఆలివ్ నూనె ఉత్పత్తి తక్కువగా ఉంటుంది. దానిని మధ్యప్రాచ్యం, మధ్యధరా దేశాల నుండి దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. కాబట్టి భారత్‌లో ఆలివ్ నూనె ధర చాలా ఎక్కువగా ఉంటుంది. కానీ ఆర్థిక స్తోమతను బట్టి అరుదుగానైనా ఆలివ్ నూనెను వంటలో భాగం చేసుకోవడం ముఖ్యం. దీనిలో విటమిన్ ఎ, విటమిన్ డి, విటమిన్ ఇ, విటమిన్ కె ఉంటాయి. అంతేగాక ఇది యాంటీ ఇన్ఫ్లమేటరీ కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సాయపడుతుంది.

## మళ్లీ మళ్లీ పెరిగే దంతాలు



పాల దంతాలు ఊడిపోయి, వాటి స్థానంలో శాశ్వత దంతాలొస్తాయి. ఈ రెండో దంతాలు ఊడిపోతే కట్టుడు దంతాలు మినహా మరే మార్గమూ ఉండదు. కానీ తాజాగా జపాన్ శాస్త్రవేత్తలు మూడోసారి దంతాలు పెరిగే ఒక ఔషధాన్ని సృష్టించే ప్రయత్నంలో ఉన్నారు. ఆసక్తికరమైన ఈ అంశం గురించి తెలుసుకుందాం!రెండోసారి ఊడిపోయిన శాశ్వత దంతాల స్థానంలో, చిగుళ్ల నుంచి మూడో దంతాల సెట్ పెరగడం ఎలా ఉంటుందో ఒకసారి ఊహించండి. కిటానో ఆస్పత్రి మెడికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన డాక్టర్ కట్సు టకహాషి నాయకత్వంలోని పరిశోధకుల బృందం, దంతాల పెరుగుదలకు అవరోధంగా మారుతున్న యుఎసఎజి-1 అనే జన్యు ప్రొటీన్‌ను అడ్డుకునే ఔషధాన్ని అభివృద్ధి చేసింది. ఎలుకల మీద చేపట్టిన ప్రయోగాల్లో, ఈ ప్రొటీన్‌ను అణచివేయడం ద్వారా, కొత్త దంతాల పెరుగుదల విజయవంతంగా ఊపందుకోవడాన్ని పరిశోధకులు కనిపెట్టారు. 2013 నాటికి ఈ చికిత్సను ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో, మనుషుల మీద కూడా ఈ ప్రయోగాలను చేపట్టడానికి పరిశోధకులు సిద్ధపడుతున్నారు. ఈ ప్రయోగం విజయవంతమైతే, ఎన్నో కోట్ల మందికి మూడవ దంతాల సెట్ ప్రయోజనం దక్కుతుంది. దశాబ్దాల పునరుత్పాదక పరిశోధన ఆధారంగా నిర్మితమైన సైన్స్... షార్కులు, ఏనుగుల మాదిరిగానే మనుషులు కూడా సహజసిద్ధంగా పెరిగే బహుళ దంతాల సెట్‌ను కలిగి ఉంటారని పరిశోధకులు నమ్ముతున్నారు. డెంటల్ పల్ప్, ఎముకల పునరుత్పాదకతలో కొనసాగుతున్న అభివృద్ధి ఆధారంగా... జన్యుపరమైన కారణాల రీత్యా, ప్రమాదాల్లో, లేదా వార్ధక్యంతో కోల్పోయిన దంతాలను తిరిగి మొలిపించుకునే వీలు కలుగుతుందని పరిశోధకులు అంటున్నారు.

# మొండి పుండ్లకు జెల్ చికిత్స!

# తాజా అధ్యయనంలో కీలక విషయాలు!

### పుండు మానడంలో ఆక్సిజన్‌ది కీలక పాత్ర

### పరిశోధకులు ఏం చెప్తున్నారంటే!



ఎంతకీ మానని మొండి పుండ్లు పెద్ద సమస్య. వీటికి చికిత్స చేయటం చాలా కష్టం. ఒకవేళ పుండ్లు మానకపోతే పాదాలు, వేళ్లు తొలగించాల్సిన పరిస్థితీ తలెత్తుతుంది. రోజు రోజుకీ వృద్ధులు, డయాబెటిస్ బాధితుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో మొండి పుండ్ల కొత్త చికిత్సలకూ ప్రాధాన్యం ఏర్పడుతోంది. దీని విషయంలో యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, రివర్‌సైడ్ రూపొందించిన జెల్ పట్టీ వ్యవస్థ కొత్త ఆశలు రేపుతోంది. గాయమైన చోట లేదా పుండ్లు ఉన్న చోట నిరంతరం ఆక్సిజన్ సరఫరా చేయటం ద్వారా పుండ్లు మానేలా చేయటం దీని ప్రత్యేకత. మరి, అదెలాగో ఇప్పుడు తెలుసుకుందాం!

**ఆక్సిజన్ పాత్ర :** మామూలుగా నాలుగు వారాల్లోపు నయం కాని పుండ్లను మొండిపుండ్లుగా భావిస్తుంటారు. ఈ రకం పుండ్లు నెలల కొద్దీ మానకుండా వేధిస్తుంటాయి. వీటితో ఇన్‌ఫెక్షన్ ఎక్కువ కావటం, హాస్పిటల్‌లో చేరాల్సి రావటం వంటి జరుగుతుంటాయి. కొన్ని సార్లు కాళ్లూ, చేతుల వంటివి తొలగించాల్సిన పరిస్థితీ కూడా ఏర్పడుతుంది. ప్రపంచ వ్యాప్తంగా ఏటా సుమారు 1.2 కోట్ల మంది మొండి పుండ్ల బారినపడుతున్నారని నివేదికలు అంచనా వేస్తున్నాయి. వీరిలో సుమారు 20 శాతం మందికి పాదాలు, వేళ్ల వంటివి తొలగించాల్సిన పరిస్థితి తలెత్తుతుందని పేర్కొన్నాయి. పుండ్లు మానకపోవటానికి ఒక ప్రధాన కారణం.. ఆ భాగానికి తగినంతగా, స్థిరంగా ఆక్సిజన్ అందకపోవటమే అంటున్నారు నిపుణులు.సాధారణంగా పుండు 4 దశలు ద్వారా మానుతుం టున్నారు నిపుణులు. ముందు వాపు ప్రక్రియ తలెత్తుతుందని, ఆ తర్వాత కొత్త రక్తనాళాలు పుట్టుకొస్తాయని పేర్కొంటున్నారు. అనంతరం కణజాలం తిరిగి కుదురుకుంటుందని తెలియజేస్తున్నారు. ఆఖరికి కొత్త కణజాలం ఏర్పడుతుందని వివరిస్తున్నారు. ఈ క్రమంలో అన్ని దశల్లోనూ ఆక్సిజన్ పాత్ర కీలకమంటున్నారు. ఆక్సిజన్ తగినంత అందకపోతే వాపు ప్రక్రియ ఎక్కువ కాలం కొనసాగుతుందని చెబుతున్నారు. ఇది బ్యాక్టీరియా వృద్ధి చెందటానికి, ఇన్‌ఫెక్షన్ తలెత్తటానికి అనువైన వాతావరణం కల్పిస్తుందని తెలియజేస్తున్నారు. మరోవైపు కణజాలం తిరిగి కోలుకునే ప్రక్రియ కూడా నిలిచిపోతుందని వెల్లడిస్తున్నారు. దెబ్బతిన్న కణజాలం లోతుల్లోకి ఆక్సిజన్ చేరకపోతే మరింత సమస్యంగా మారుతుందని హెచ్చరిస్తున్నారు. దీన్ని పరిష్కరించటానికే ఖజ= పరిశోధకులు కొత్త జెల్ వ్యవస్థను రూపొందించారు. మెత్తగా, మృదువుగా ఉండే ఇది గాయమైన భాగం వద్దే నిరంతరం నేరుగా ఆక్సిజన్‌ను సృష్టిస్తుందంటున్నారు పరిశోధకులు.

**ఎలా పనిచేస్తుంది :** జెల్ పట్టీలో నీరు, కొలిన్ ఆధారిత ద్రవం ఉంటుందని పరిశోధకులు చెబుతున్నారు. యాంటీ బ్యాక్టీరియా గుణం గల కొలిన్ ఆధారిత ద్రవం సురక్షితమైందని, తనకు తానే క్షీణిస్తుందని అంటున్నారు. వినికిడి సాధనాల్లో ఉండేటువంటి చిన్న బ్యాటరీతో అనుసంధానమైనప్పుడు ఈ వ్యవస్థ చిన్న విద్యుత్ రసాయన పరికరంగా మారుతుందని పేర్కొంటున్నారు. అప్పుడు నీటి అణువులు విడిపోయి నెమ్మదిగా, అవసరమైనంత మేరకు ఆక్సిజన్ పుట్టుకొస్తూ ఉంటుందని వివరిస్తున్నారు. ద్రవాలను పీల్చుకునే లేదా యాంటీ మైక్రోబియల్ పదార్థాలతో కూడిన సంప్రదాయ పుండ్ల పట్టీల మాదిరిగా కాకుండా ఇది ఆక్సిజన్ లేమి సమస్యను పరిష్కరించటం ద్వారా పనిచేస్తుందని తెలియజేస్తున్నారు. ముందుగా పుండు ఆకారాన్ని కచ్చితంగా మార్చి, ఆక్సిజన్ మోతాదులు తక్కువగా ఉన్నచోట పగుళ్లను పూడ్చివేస్తుందని చెబుతున్నారు. దీంతో ఇన్‌ఫెక్షన్ ముప్పు గణనీయంగా తగ్గుతుందని అంటున్నారు. నిరంతరం ఆక్సిజన్ సరఫరా కావటం వల్ల రక్తనాళాలూ త్వరగా పుట్టుకొస్తాయని, ఫలితంగా పుండు వేగంగా మానుతుందని సూచిస్తున్నారు.

**ఆశాజనక ఫలితాలు :** వినూత్న జెల్ పట్టీని డయాబెటిస్ గల, వృద్ధ ఎలుకల మీద ప్రయోగించి, పరిశీలించారు పరిశోధకులు. ఎందుకంటే, వీటి పుండ్లు వృద్ధుల్లో తలెత్తే దీర్ఘకాల పుండ్లనే పోలి ఉన్నాయంటున్నారు. చికిత్స చేయకపోతే పుండు మానదని, ప్రాణాంతకంగానూ పరిణమిస్తుందని హెచ్చరిస్తున్నారు. అందుకే, ఎలుకలకు వారానికి ఒకోసారి పట్టీని మార్చుతూ, సుమారు 23 రోజుల పాటు చికిత్స చేశారని వివరిస్తున్నారు. అన్నీ జీవించి ఉన్నాయని తెలియజేస్తున్నారు. తద్వారా పట్టీ మంచి ఫలితం చూపుతున్నట్టు దీని ద్వారా రుజువైందని చెబుతున్నారు. ల్యాబ్‌లో కణజాలాలు, అవయవాలను వృద్ధి చేయటంలోనూ ఆక్సిజన్, పోషకాలు అందేలా చూడటం కీలకమంటున్నారు. ఇలాంటి వాటికీ జెల్ పట్టీ ఉపయోగపడగలదని భావిస్తున్నారు.

# గ్రీన్ టీతో మెదడు చురుకుదనం



గ్రీన్ టీ ఆరోగ్యకరం అనే విషయం మనందరికీ తెలిసిందే! అయితే గ్రీన్ టీలోని సహజసిద్ధ మూలకాలు అల్జీమర్స్ నుంచి మెదడుకు రక్షణ కల్పిస్తాయనే ఒక అధ్యయనం తాజాగా వెలుగులోకొచ్చింది.గ్రీన్ టీలోని నికోటినమైడ్, ఎపిగాలోక్టేకిన్ గాలేట్ అనే రెండు సహజసిద్ధ మూలకాలు మెదడులోని పాత కణాలు కొత్త వాటిలా చురుగ్గా పని చేసేందుకు దోహదపడతాయని క్యాలిఫోర్నియా విశ్వవిద్యాలయ పరిశోధకులు కనిపెట్టారు. ఈ రెండు మూలకాలు, నష్ట నివారణలో తోడ్పడే జిటిపి అనే కీలక శక్తి అణువులను పునరుద్ధరిస్తాయని వారు పేర్కొంటున్నారు. ఈ ప్రయోగాన్ని వయసు పైబడిన ఎలుకల మీద చేపట్టినప్పుడు, అల్జీమర్స్ వ్యాధితో ముడిపడి ఉన్న అమైలాయిడ్ బీటా అనే ప్రొటీన్ మోతాదు తగ్గడాన్ని పరిశోధకులు గుర్తించారు. సాధారణంగా మనుషులకు వయసు పైబడినప్పుడు, మెదడు కణాలు శక్తిని కోల్పోతూ ఉంటాయి. ఆ కణాలను గ్రీన్ టీలోని రెండు సహజసిద్ధ మూలకాలతో చికిత్స చేసినప్పుడు, కేవలం 24 గంటల్లోనే, శక్తిమోతాదులు పెరిగి, మెదడులో 'ఆటొఫజీ' ఊపందుకుంటోంది. ఈ చికిత్స ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను కూడా తగ్గిస్తుంది. గతంలో అల్జీమర్స్ పరిశోధనల్లో, మెదడు కణాలను ఆరోగ్యంగా ఉంచడంలో జిటిపి పాత్రకున్న ప్రాధాన్యాన్ని పరిశోధకులు పెద్దగా పట్టించుకోలేదు. తాజా అధ్యయనంలో వాటిని బలపరుచుకునే మార్గం తెలిసింది కాబట్టి గ్రీన్ టీతో మెదడు కణాలను ఆరోగ్యంగా ఉంచుకోవడం ద్వారా అల్జీమర్స్‌కు అడ్డుకట్ట వేయగలిగే మార్గం సుగమం అయింది.

# మీ గట్ హెల్త్ బాగుండాలా

### ఆహారంలో వీటిని చేర్చుకుంటే

### మేలంటున్న నిపుణులు!

### జీర్ణ సంబంధిత సమస్యలు దూరం

### చేసుకోవాలా

### ఫైబర్ ఉన్న ఆహారాలు మేలు చేస్తాయట!

### ఎందుకో వివరిస్తోన్న నిపుణులు!



మంచి జీర్ణక్రియ, రోగనిరోధక శక్తి, మానసిక స్థితి, మెటబాలిజం వంటి అంశాలలో గట్ హెల్త్ కీలక పాత్ర పోషిస్తుంది. అది ఆరోగ్యంగా ఉండాలంటే తాజా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు తినాల్సిందే. అయితే వీటితో పాటు కొంచెం పీచు పదార్థాలు తింటే గట్ ఆరోగ్యం మరింత బాగుంటుందంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో ఎలాంటి ఆహార పదార్థాలు తీసుకుంటే గట్ హెల్త్‌కు మంచిదో ఇప్పుడు తెలుసుకుందాం!

**దోరగా ఉన్న అరటిపండ్లు :** అరటిపండ్లు, ముఖ్యంగా కొంచెం పచ్చగా ఉన్నవి, 'రెసిస్టెంట్ స్టార్చ్' అనే పీచు పదార్థాన్ని కలిగి ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇది ఒక ప్రీ బయోటిక్ వలె పనిచేస్తుందని తెలియజేస్తున్నారు. అంటే, ఇది జీర్ణవ్యవస్థలోని మంచి బ్యాక్టీరియాకు ఆహారాన్ని అందిస్తుందని పేర్కొంటున్నారు. అలాగే, రక్తంలోని చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచడానికి, కడుపు నిండుగా ఉన్న అనుభూతిని కలిగించడానికి, జీర్ణక్రియ సజావుగా సాగడానికి సహాయపడుతుందని వివరిస్తున్నారు.

**చియా గింజలు :** చియా గింజలు పరిమాణంలో చిన్నవైనప్పటికీ, పోషకాల పరంగా చాలా శక్తివంతమైనవి. వీటిలో కరిగే పీచు పదార్థం అధికంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఇది పేగుల్లో జెల్ వంటి పదార్థాన్ని ఏర్పరుస్తుందంటున్నారు.తద్వారా జీర్ణక్రియను నెమ్మదింపజేయడానికి, రక్తంలోని చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచడానికి సహాయపడుతుందని తెలియజేస్తున్నారు. ఈ క్రమంలో రోజుకు ఒకటి లేదా రెండు టేబుల్ స్పూన్ల చియా గింజలను పెరుగులో కలుపుకొని గానీ, రాత్రంతా నానబెట్టి గానీ లేదా స్మూతీస్‌లో కలిపి గానీ తీసుకోవడం వల్ల జీర్ణక్రియ సామర్థ్యం మెరుగుపడుతుందట.

**పప్పుధాన్యాలు, లెగ్యూమ్స్ :** మన శరీరానికి కరిగే, కరగని పీచు పదార్థాలతో పాటు మొక్కల నుంచి లభించే ప్రోటీన్‌ను కూడా పప్పు దినుసులు అందిస్తాయంటున్నారు నిపుణులు. పప్పుధాన్యాలు, లెగ్యూమ్స్ విరేచనం సాఫీగా అయ్యేలా నియంత్రించడమే కాకుండా, పేగుల్లోని సూక్ష్మజీవులకు శక్తిని ఇస్తుందని చెబుతున్నారు. ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి, రక్తంలోని చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడానికి కూడా తోడ్పడతాయని వివరిస్తున్నారు. ఈ క్రమంలో రోజువారీ ఆహారంలో అర కప్పు నుంచి ఒక కప్పు వరకు వండిన పప్పుధాన్యాలను చేర్చుకోవడం వల్ల శరీరానికి కావలసిన పీచు పదార్థం అందుతుందని పేర్కొంటున్నారు. లిమా బీన్స్, పచ్చి బఠానీలు, శనగలు, కిడ్నీ బీన్స్‌లో ఫైబర్ ఎక్కువగా ఉంటుందని అధ్యయనం పేర్కొంది.

**బెర్రీలు :** బెర్రీలు, ముఖ్యంగా బ్లూ బెర్రీలు, రాస్ప్‌బెర్రీలలో పీచు పదార్థంతో పాటు పాలీఫెనాల్స్ పుష్కలంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఈ పాలీఫెనాల్స్ పేగుల్లోని సూక్ష్మజీవుల వైవిధ్యాన్ని పెంచడానికి, జీర్ణవ్యవస్థలో వాపును తగ్గించడానికి సహాయపడతాయంటున్నారు. సమతుల్య ఆహారంలో భాగంగా ప్రతిరోజూ అర కప్పు నుంచి ఒక కప్పు వరకు బెర్రీలను తీసుకోవాలని సూచిస్తున్నారు.

**నట్స్ :** వాల్‌నట్స్, పిస్తా, జీడిపప్పు, బాదం పప్పులోని పీచు పదార్థం కడుపు నిండుగా ఉన్న అనుభూతిని ఇవ్వడమే కాకుండా, మెటబాలిక్ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయంటున్నారు నిపుణులు. ప్రతిరోజూ పావుకప్పు నట్స్ తీసుకోవడం వల్ల పేగుల్లోని సూక్ష్మజీవుల వైవిధ్యం పెరుగుతుందని చెబుతున్నారు. అంతేకాకుండా, వీటిని ఎక్కడికైనా సులభంగా తీసుకెళ్లవచ్చు, రోజువారీ ఆహారంలో చాలా తేలికగా చేర్చుకోవచ్చుట. పిస్తా, జీడిపప్పు, బాదం.. మన గట్ మైక్రోబయోమ్‌కు ప్రత్యేకంగా సహాయపడతాయని అధ్యయనం పేర్కొంది.పేగు ఆరోగ్యానికి పీచు పదార్థం ఎందుకు అవసరం? : జీర్ణవ్యవస్థలో సమతుల్యతను కాపాడటంలో పీచు పదార్థం కీలక పాత్ర పోషిస్తుంది. ఇది మలబద్ధకాన్ని తగ్గించడానికి, విరేచనం సాఫీగా అయ్యేలా నియంత్రించడానికి, గుండె జబ్బులు, పేగు క్యాన్సర్, టైప్ 2 డయాబెటిస్ వంటి వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడానికి సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. గట్ మైక్రోబయోటా వైవిధ్యాన్ని నిర్వహించడానికి ఆహారంలో ఫైబర్ కీలకమైన పోషకమని అధ్యయనం పేర్కొంది.

# పార్కిన్సన్స్ ప్రాణాంతకమా?




పార్కిన్సన్స్ వ్యాధి శరీర అవయవాల కదలికలకు సంబంధించిన రుగ్మతల విభాగంలోకి చేరుతుంది. శరీర భాగాలు అప్రయత్నంగా వణకడం (ట్రెమర్స్), పట్టేసినట్టు ఉండటం (స్టిఫ్‌నెస్), కదలికలు నెమ్మదించడం (స్లోనెస్), శరీరం పట్టుతప్పడం (ఇంబాలెన్స్) లాంటివి పార్కిన్సన్స్ ప్రధాన లక్షణాలు. అయితే ఇవి మాత్రమే కాకుండా ఈ వ్యాధిలో ఇతర లక్షణాలు కూడా కనిపిస్తాయి. వీటిని నాన్‌మోటార్ లక్షణాలుగా పేర్కొంటారు. జ్ఞాపకశక్తి సమస్యలు, మానసిక సమస్యలు, కుంగుబాటు, ఆందోళన, మతిభ్రమించడం (సైకోసిస్), నిద్ర సంబంధ సమస్యలు, మూత్ర సమస్యలు, మలబద్ధకం, వాసన లోపించడం, అతిగా చెమట పట్టడం, తిమ్మిర్లు (నంబ్‌నెస్), నొప్పి మొదలైనవి ఉంటాయి. సాధారణంగా 50 ఏండ్లు దాటిన వాళ్లకే పార్కిన్సన్స్ వస్తుంది. అయితే, యువకులు, కౌమార వయసువారికి కూడా ఇది రావొచ్చు. 30 ఏళ్ల లోపు వస్తే యంగెస్ట్ ఆన్‌సెట్ ఆఫ్ పార్కిన్సన్స్ డిసీజ్ అని, 20 లోపే వస్తే జువనైల్ పార్కిన్సన్స్ డిసీజ్ అని పిలుస్తారు. ఏ వయసు వారికైనా ఇది రావచ్చు. కాకపోతే యువతలో ఈ వ్యాధి తలెత్తడానికి జన్యుపరమైన కారణాలు ప్రధానంగా ఉంటాయి. చికిత్స ఉన్నప్పటికీ పార్కిన్సన్స్‌ను పూర్తిగా నయం చేయలేం. పైగా జీవిత కాలం పాటు చికిత్స అవసరమవుతుంది. ఈ వ్యాధికి ఇప్పుడు మందులు, ఇంజెక్షన్లు, సర్జరీ లాంటి వివిధ రకాలైన ప్రభావవంతమైన చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఇంకో విషయం%ా% పార్కిన్సన్స్ వ్యాధి ప్రాణాంతకం కాదు. అయితే శరీరాన్ని ఇది అచేతనం చేస్తుంది. రోజువారీ పనులు, జీవన నాణ్యత మీద పార్కిన్సన్స్ ప్రభావం చూపుతుంది. అయితే, పార్కిన్సన్స్ బాధితుల జీవిత కాలం మాత్రం సాధారణ మనుషుల్లానే ఉంటుంది.

# ఈ చిట్కాలు పాటిస్తే మహిళలు నొప్పుల నుంచి ఈజీగా తప్పించుకోవచ్చు



పురుషులతో పోలిస్తే.. మహిళల్లో నొప్పులు ఎక్కువగా కనిపిస్తుంటాయి. వెన్నునొప్పి, కీళ్లనొప్పులు, మైగ్రేన్, నెలసరి సమయంలో వచ్చే నొప్పులు వారిని విపరీతంగా వేధిస్తుంటాయి. ఒక సర్వే ప్రకారం.. ప్రతి వందమందిలో దాదాపు 45 మంది మహిళలు ఏదో ఒక దీర్ఘకాలిక నొప్పితో బాధపడుతుంటారట. అయితే, కొన్ని ఇంటి చిట్కాలు, స్వీయ సంరక్షణ చర్యల ద్వారా ఆయా నొప్పుల నుంచి ఉపశమనం పొందవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

### కీళ్ల నొప్పులు

జన్యుపరమైన సమస్యలు, హార్మోన్లలో హెచ్చుతగ్గులు, మానసిక ఒత్తిడి.. మహిళలను కీళ్లనొప్పుల బారిన పడేస్తాయి. శరీరంలో యూరిక్ యాసిడ్ ఎక్కువైనా, క్యాల్షియం, విటమిన్ డి తగ్గినా.. ఈ సమస్య తీవ్రం అవుతుంది. యూరిక్ యాసిడ్‌ను తగ్గించడంలో వెల్లుల్లి అద్భుతంగా పనిచేస్తుంది. కీళ్లనొప్పులతో బాధపడేవారు ఉదయం ఖాళీ కడుపుతో మూడు నుంచి నాలుగు వెల్లుల్లి రెబ్బలు తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది. పసుపులో ఉండే 'కర్క్యుమిన్' కూడా సహజసిద్ధమైన నొప్పి నివారిణి. గ్లాసు గోరువెచ్చని పాలలో ఒక చెంచా పసుపు కలిపి తాగితే.. కీళ్ల నొప్పులు తగ్గుతాయి.


### మైగ్రేన్‌జి

పురుషుల కన్నా.. మహిళలు తరచుగా తలనొప్పికి గురయ్యే అవకాశం మూడు రెట్లు ఎక్కువ. రుతుస్రావం, హార్మోన్లలో హెచ్చుతగ్గులు, జీవనశైలి, ఒత్తిడి ఇందుకు కారణం. 93% మంది ప్రజల్లో తలనొప్పికి కారణం.. ఒత్తిడేనని తేలింది. డ్రైఫ్రూట్స్ పెయిన్ కిల్లర్స్‌లా పనిచేస్తాయి. జీడిపప్పు, బాదం, పిస్తా లాంటివి తీసుకోవడం ద్వారా తల నొప్పిని తగ్గించుకోవచ్చు. మైగ్రేన్‌తో ఎక్కువగా ఇబ్బంది పడేవారు.. క్రమం తప్పకుండా పుదీనా తీసుకోవడం మంచిది. అల్లంలోనూ తలనొప్పిని తగ్గించే లక్షణాలు ఉంటాయి. డీహైడ్రేషన్ కూడా తీవ్రమైన తలనొప్పిని కలిగిస్తుంది. కాబట్టి, కీరదోస వంటివి ఆహారంలో చేర్చుకోవాలి.

### నెలసరి నొప్పులు

పీరియడ్ హెల్త్ స్టడీ ప్రకారం.. దేశంలోని 83% మంది మహిళలు నెలసరి నొప్పితో బాధపడుతున్నారట. వీరిలో 10శాతం మందిలో నొప్పి తీవ్రంగా ఉంటూ.. రోజువారీ పనులు కూడా చేసుకోలేక పోతున్నారట. ఇలాంటివారు నెలసరి సమయంలో దుంపకూరలతోపాటు అల్లం ఎక్కువగా తీసుకోవాలి. అల్లంలో ఉండే వైద్య గుణాలు, యాంటి ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు.. కడుపులో కలిగే ఇబ్బందిని కంట్రోల్ చేస్తాయి. పెరుగు, ఎండుద్రాక్షలను కలిపి తీసుకోవడం ద్వారా నెలసరి నొప్పుల నుంచి బయటపడొచ్చు. సోంపు గింజల్ని నమిలినా, వాటిని నీటిలో మరిగించి తాగినా నెలసరి నొప్పులు తగ్గుతాయి.

# పుట్టుకతో థైరాయిడ్ సమస్య



మా పాపకు పుట్టిన రోజే జాండిస్ ఉంది. చికిత్స చేయించాం. మూడు వారాలు గడిచినా తగ్గలేదు. డాక్టర్ దగ్గరికి తీసుకెళ్తే కొన్ని పరీక్షలు చేశారు. థైరాయిడ్ సమస్య ఉందని నిర్ధారించారు. పాపకు జీవితాంతం థైరాయిడ్ మందు వాడాలని చెప్పారు. నెల వయసు బిడ్డకు థైరాయిడ్ సమస్య వస్తుందా? జీవితాంతం మందులు వాడితే సైడ్ ఎఫెక్ట్స్ ఏమైనా ఉంటాయా? మీరు చెప్పినదాన్ని బట్టి మీ బిడ్డకు పుట్టుకతోనే థైరాయిడ్ హార్మోన్‌లో లోపం ఉంది. దీనిని హైపోథైరాయిడిజం అంటారు. వెయ్యి మంది శిశువుల్లో ఒకరు ఈ సమస్య బారినపడుతుంటారు. థైరాయిడ్ సమస్యను తొందరగా గుర్తించిన వైద్యుడిని అభినందించాలి. కామెర్ల వ్యాధి రెండు, మూడు వారాలు గడిచినా తగ్గనప్పుడు.. అది పుట్టుకతో సాధారణంగా వచ్చిన కామెర్ల వ్యాధా? లేక వేరే ఇబ్బందులు ఏవైనా ఉన్నాయేమో తెలుసుకునేందుకు పరీక్షలు చేస్తారు. వాటిలో ముఖ్యమైంది థైరాయిడ్ పరీక్ష. హైపోథైరాయిడిజంతో బాధపడే పిల్లల్లో థైరాయిడ్ హార్మోన్ తక్కువగా ఉండటం వల్ల శారీరక, మానసిక ఎదుగుదల పూర్తిగా జరగదు. కాబట్టి భవిష్యత్‌లో మీ బిడ్డకు ఇబ్బందులు రావొచ్చు. కానీ, సకాలంలో వైద్యుడు ఆ సమస్యను గుర్తించడం, సరైన చికిత్స జరగడం వల్ల మీ బిడ్డకు శారీరక, మానసిక వైకల్యం కలగదు. ఈ సమస్య జీవితాంతం ఉంటుంది. కాబట్టి ఎప్పుడూ మందులు వాడుతూ ఉండాలి. శరీరంలో ఉండాల్సిన హార్మోన్ లేకపోవడం వల్ల దానిని మందుల రూపంలో అందిస్తున్నారు. కాబట్టి ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు.

# మెగ్నీషియం.. మెగా ప్రయోజనం!




మారుతున్న జీవనశైలి.. మనిషిని మంచాన పడేస్తున్నది. అవసరమైన పోషకాలు లేక.. శరీరం రోగాల పుట్టగా మారుతున్నది. చీటికీమాటికీ ఇన్ఫెక్షన్ల బారిన పడుతున్నది. ముఖ్యంగా, 'మెగ్నీషియం' లోపంతో నవతరం తీవ్రంగా ఇబ్బంది పడుతున్నది. రోజువారీ జీవితంలో కీలకపాత్ర పోషించే మెగ్నీషియం.. మనిషి శరీరంలో జరిగే సుమారు 300 రకాల రసాయనిక చర్యల్లో కీలకపాత్ర పోషిస్తుంది. అలాంటి మెగ్నీషియం లోపిస్తే.. తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ లెక్కల ప్రకారం.. ప్రతిరోజూ పురుషులకు 400 మి.గ్రా., మహిళలకు 300 మి.గ్రా. మెగ్నీషియం అవసరమవుతుంది. రోజువారీగా తీసుకునే ఆహారం ద్వారా ఇది శరీరానికి అందుతుంది. అయితే, శరీరానికి తగినంత మెగ్నీషియం అందకపోతే.. మనిషిలో అనేక లక్షణాలు కనిపిస్తాయి. వీటిని ముందుగానే గుర్తించి, వైద్యుణ్ని సంప్రదిస్తే మంచిది. శరీరంలో మెగ్నీషియం తగినంత పరిమాణంలో ఉంటేనే.. హృదయ స్పందనలు సక్రమంగా సాగుతాయి. లేకుంటే.. హార్ట్‌రేట్ రూటు మారుతుంది. గుండె దడగా అనిపిస్తుంది. ఊపిరి పీల్చుకోవడంలోనూ ఇబ్బంది కలుగుతుంది. వికారంగా అనిపించినా, ఆకలి లేకపోయినా.. మీ శరీరంలో మెగ్నీషియం లోపం ఉన్నట్టే! జీర్ణాశయం సజావుగా పనిచేయడంలోనూ మెగ్నీషియం పాత్ర ఉంటుంది. శరీరంలో మెగ్నీషియం తగ్గితే.. జీర్ణ సమస్యలకు దారితీస్తుంది. శరీరంలో తగినంత మెగ్నీషియం లేకుంటే.. కంటి సమస్యలూ చుట్టుముడతాయి. కళ్ల మంట, కళ్ల నుంచి నీరుకారడం లాంటి సమస్యలు కనిపిస్తాయి. కండరాల ఆరోగ్యం, పనితీరులో మెగ్నీషియం కీలకంగా వ్యవహరిస్తుంది. ఇది శరీరంలో తగినంతగా లేకపోతే తీవ్రమైన కండరాల నొప్పి, తిమ్మిరి వేధిస్తాయి. మెగ్నీషియం లోపం.. మనిషికి నిద్రను దూరం చేస్తుంది. నిద్రలేమితోపాటు తలనొప్పి, చికాకు ఇబ్బంది పెడుతాయి. ఎముకలు, నరాలు ఆరోగ్యంగా ఉండాలన్నా, వాటి పనితీరు బాగుండాలన్నా.. కావాల్సినంత మెగ్నీషియం ఉండాల్సిందే! కాల్షియం కూడా చాలా అవసరం. ఈ ఖనిజాలలో అసమతుల్యత కండరాల తిమ్మిరి, కండరాల నొప్పికి కారణమవుతుంది. కాల్షియం, మెగ్నీషియం రెండిటినీ సమతుల్యంగా ఉంచుకోవడం చాలా అవసరం.

### ఆహారంతో అందిద్దాం..

మెగ్నీషియం లోపం ఉన్నవారు రోజువారీ ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవాలి. గుమ్మడి గింజలు, పాలకూర, బచ్చలికూర, అరటిపండ్లు, నల్ల జీలకర్ర, పల్లీలు, బ్రౌన్ రైస్, సాల్మన్ చేపల్లో మెగ్నీషియం ఎక్కువగా దొరుకుతుంది. జీడిపప్పు, బాదంపప్పు, అవకాడో, నట్స్, బ్రౌన్ రైస్, తృణధాన్యాలు, బీన్స్, పప్పు దినుసులు, పచ్చి బఠానీలు, శనగలు, పాలు, పెరుగు, సోయా ఉత్పత్తుల్లోనూ మెగ్నీషియం లభ్యమవుతుంది. బెర్రీలు, అంజీర్, బ్రకోలీ, క్యాబేజీ, మొలకలలోనూ మెగ్నీషియం పుష్కలంగా లభిస్తుంది. ఇక శరీరంలో మెగ్నీషియం తక్షణమే ఉత్పత్తి కావాలంటే.. ఒక కప్పు కాఫీ తాగడమో.. ఒక డార్క్ చాక్లెట్ తినడమో చేయాలి.

# జాయ సేనాపతి చారిత్రక కాల్పనిక నవల




జరిగిన కథ : కృష్ణమ్మ ఉప్పెనలో కొట్టుకొని పోయిన జాయపుడు, మువ్వ.. చచ్చిబతికి, కూసెనపూండి అగ్రహారం మాదిగవాడకు చేరుకున్నారు. మిత్రుడు పరాశరుడితోపాటు తమ్ముని కోసం పృథ్వీశ్వరుడు నియమించిన పల్లికేతు, విక్రమ.. జాయపుణ్ని వెతుక్కుంటూ వచ్చారు. తన యోగక్షేమాలతోపాటు తనను రక్షించినవారిని వదిలివెళ్లడం ఇష్టంగా లేదనీ, ఆరోగ్యం కుదుటపడ్డాక వస్తాననీ పల్లికేతు ద్వారా అన్న పృథ్వీశ్వరుడికి తెలియజేశాడు జాయపుడు. వాడవాసులకు తాను జగన్నాథుడని, అనుమకొండవాసిననీ చెప్పాడు. ఆరోగ్యం కుదుటపడే వరకూ అక్కడే ఉండి ఆ సమయాన్ని యక్షగానాలు, నాట్యరూపకాల రచనకు ఉపయోగించాలని అనుకున్నాడు జాయపుడు. పరాశరునితో తాళపత్రాలు, ఘంటాలు, సిరా పిడతలు తెప్పించుకున్నాడు. ఆ కూసెనపూండి గ్రామంతో తన కళాజీవితం పెనవేసుకుంటున్నదని.. ఇక్కడే తానొక మహాకళాక్షేత్రాన్ని నిర్మించబోతున్నానని జాయపుడు ఊహించలేదప్పుడు. పర్ణశాలకు కాస్త ఆవలగా గజ్జెలసవ్వడి! ఏదో నాట్యాభ్యాసం, నాట్యశిక్షణ లాంటిది జరుగుతున్నట్లు వినిపిస్తున్నది. కాస్త ఓపిక చేసుకుని మెల్లగా పర్ణశాల బయటికి వచ్చి, అటుగా పోతున్న వ్యక్తిని అడిగాడు జాయపుడు.

**"ఆ గజ్జెల శబ్దం ఏమిటి?" అని.**

"ఇది బాగోతుల కూసెనపూండి గందా. ఆ బాగోతుల సిద్ధయ నాట్టెం నేర్పుతాడుగా.." చెబుతూ వెళ్లిపోయాడు. జాయపుడు మెల్లగా కుంటుకుంటూ ఆ గజ్జెలసవ్వడి వినవచ్చిన వైపుగా వెళ్లి.. అగ్రహారంలో నాట్యాభ్యాసం జరుగుతున్న గృహాన్ని గుర్తించాడు. గజ్జెలశబ్దం, నట్టువాంగం, ఓ పాట.. గాలితో కలగలిసి వీధులవెంట ప్రవహిస్తూ చిందులు వేస్తున్నది. చక్కగా అలికి ముగ్గులుపెట్టిన మట్టి అరుగుపై కూర్చుని నాట్యానికి కూర్చిన పాటను వింటూ నాట్య భంగిమలు ఊహిస్తున్నాడు. నాట్యగురువు శిష్యులకు కొన్ని కిటుకులు చెప్పడం వినిపిస్తున్నది. అనంతరం పిల్లలు గోలగోలగా అరుచుకుంటూ బయటికి పరుగులు పెట్టారు. తర్వాత బయటికి వచ్చాడు నాట్యగురువు సిద్ధయ. మీగడ వర్ణపు ధోవతిపై వెండివర్ణపు పట్టుకండువా వల్లెవాటుగా ధరించి, విశాలమైన నుదుట తిరునామం, నున్నగా దువ్వికట్టిన శిఖతో నాజూకు శరీరంతో నవనవలాడుతూ ముప్ఫైలలో ఉన్న యువకుడతను. జాయపుణ్ని చూసి. "అరెరే.. బయటే కూర్చున్నారు. తమరెవరో మహాపురుషుల్లాగా ఉన్నారు?" అన్నాడు ప్రశ్నార్థకంగా. జాయపుడు మాత్రం ఎక్కువమంది పిల్లలు బ్రాహ్మణ ఆహార్యంలో ఉండటం చూస్తున్నాడు. "పురుషుణ్నే కానీ మహాపురుషుణ్ని కాను.." అంటూ నవ్వాడు. "నా పేరు జగన్నాథుడు. అనుమకొండ నివాసిని. నంగెగడ్డలో బంధువులు ఉంటే చూసిపోవడానికి వచ్చి ఉప్పెన బారినపడి ఇక్కడ తేలాను!". "ఆ వ్యక్తి తమరేనా!? విన్నాను. అయితే అనుమకొండ వారన్నమాట. ఆగండాగండి ఆసనం తెస్తాను!". "వద్దొద్దు. ఇంతకన్నా ఉన్నతాసనం ఉంటుందా?" అంటూ బాసింపట్టును పద్మాసనంలోకి మార్చాడు జాయపుడు. "నాపేరు సిద్ధయ. ఊరివాళ్లు భాగోతుల సిద్ధయ అంటారు" చెబుతూ జాయపుని ముందు చతికిలబడ్డాడు. 'తిరునామం పెట్టుకున్నవాళ్లను 'భాగవతులు' అంటూండటం ద్వీపరాజ్యంలో మరీ ఎక్కువగా వినిపిస్తున్నదే!' అనుకున్నాడు జాయపుడు. "ఇదేమిటి.. మీ విద్యార్థులంతా బ్రాహ్మణులేనా.. ఇతరులకు నేర్పరా??!". "అందరూ నాపై చేసే విమర్శ అదే. ఇది పూర్తిగా బ్రాహ్మణ అగ్రహారం. ఇది పాతికగృహాల గ్రామంగా ఉన్నప్పుడే అప్పటి పాలకుడు రాజేంద్రచోళుడు 'కూసెనభట్టు' అనే ఉపాధ్యాయునికి దానం చేశారు. ఇక్కడి కులీనరైతులు పంట సాగుచేసి ధాన్యంవాటాను అగ్రహార వారసునికి ఇస్తారు కానీ, పిల్లలను చదువులకే పంపరు. ఇక నాట్యం అంటే మక్కెలు విరగ్గొడతారు. ఆసక్తిగల పిల్లలు కొందరున్నా.. వాళ్లూ నిత్యమూ తరగతులకు రారు. అందువల్ల చదువే ఏకైకవృత్తిగా గల బ్రాహ్మణ పిల్లలే ఎక్కువగా వస్తారు. అందువల్లనేమో కూసెనపూండిని అందరూ భాగోతుల కూసెనపూండి అంటున్నారు". మరో వాస్తవం చెప్పాడు భాగవత సిద్ధయ. "పంచముల పిల్లలకు కళలంటే ఆసక్తి ఉన్నా.. సామాజిక కట్టుబాట్లు ప్రధాన అడ్డంకి. అగ్రహార పెద్దలు కూడా దైవదత్తమైన కళను పంచములకు నేర్పడం అంతగా ఇష్టపడరు. ఎవరికైనా నాట్యం నేర్పడానికి నా గృహం ఎప్పుడూ తెరిచే ఉంటుంది. ఇన్ని సామాజిక కట్టుబాట్ల మధ్య తరగతికే రానివారికి నాట్యం నేర్పలేను కదా!?". అనుభవంతో ఆయన చెప్పినదాంట్లో వాస్తవం ఉంది. "ఓ రహస్యం.. మనసులో పెట్టుకోండి. నాట్యంపట్ల ఆసక్తి ఉన్న పంచముల పిల్లలకు జంధ్యంవేసి నాట్యం నేర్పుతుంటాను. ఇది చాలామంది గురువులు చేసేపనే! ఆసక్తి ఉన్నవాడికి చెప్పాలన్న దురద గురువులకు ఉండటం సహజం. ఇది తాతల కాలంనుంచి ఉన్న అనుభవమే. ఇప్పుడు గొప్ప నాట్యాచార్యులుగా గుర్తింపు పొందుతున్నవారిలో ఈ తరహా పంచములు కూడా ఉన్నారని మీకు తెలిసి ఉండొచ్చు!". ఆశ్చర్యపోయిన జాయపుడు సిద్ధయతో కలిసి భళ్లున నవ్వాడు అంగీకరిస్తున్నట్లు. అతనికి మువ్వ గుర్తొచ్చింది. ఈయన మువ్వను చూస్తే తప్పక నాట్యం నేర్పేవాడేమో.. కానీ ఆమెకు జంధ్యం వెయ్యడం ఎలా!?.. మళ్లీ నవ్వు తన్నుకురాగా లేచి నమస్కరించాడు. "సంతోషం మీ పరిచయం. రేపు మీ నాట్యాభ్యాసం చూడటానికి అనుజ్ఞ ఇవ్వండి". "అయ్యయ్యో.. రేపే మేము దక్షిణాదికి వెళ్లబోతున్నాం. దాదాపు రెండుమాసాల తర్వాత తిరిగి గ్రామం చేరతాం. అప్పుడు తమరు మా ప్రదర్శనను మీకు చూపే అవకాశం మాకు ఇవ్వండి.." అన్నాడు. "అలాగా!? నాకూ మరిన్ని పనులున్నాయి. లేకుంటే మీతోనే వచ్చేవాణ్ని!" అంటూ.. అతణ్ని సంతోషపుచ్చి వెనుతిరిగాడు. తర్వాత తర్వాత రాజబంధువు జగన్నాథునికి, గొప్ప నాట్యకారుడు, నాట్యగురువు సిద్ధయకు మధ్య అపూర్వ స్నేహం, అనుబంధం ఏర్పడ్డాయి. గుంపులుగా వివిధ సామాజికవర్గాలు వేరువేరు రాజ్యాలకు, మండలాలకు, నాడులకు తరలిపోవడం ఇప్పుడు సర్వసాధారణం. ముఖ్యంగా బ్రాహ్మణులు, పండితులు ఎక్కడ పాలకుల అనుగ్రహం ఉందని తెలుస్తుందో.. అక్కడికి వెళ్లిపోతుంటారు. పంచాణంవారిని అనేక రాజ్యాలవారు నెత్తిన పెట్టుకుంటారు. సేవావృత్తులైన చాకలి, మంగలివాళ్ల కోసం చాలాగ్రామాల రట్టలు బాజాభజంత్రీలతో ఆహ్వానాలు పలుకుతుంటారు. కరువు కాలంలో, అంటువ్యాధుల కాలంలో రైతులు, రైతుకూలీలు దూరరాజ్యాలకు వెళ్లడం కద్దు. రాజాశ్రయమే ముఖ్యమైన ప్రదర్శన కళాబృందాలు సంచారజాతుల్లా ఎప్పుడూ తిరుగుతూనే ఉంటారు. వెలనాడు సంపద్వంతమైన రాజ్యం కావడంతో రైతులు, కూలీలు, వృత్తులవారి కంటే కళాకారబృందాలే ఎక్కువగా వస్తూ పోతూ బాగా సంపాదిస్తుంటారని చెప్పుకొంటారు. రాజు తర్వాత సమాజం పూజించేది కవి పండితులను, నాట్యకారులను అని చెప్పుకొన్నా.. అది జనాభాలో పది శాతమే. తొంభైశాతం జనాభా కళలను ఆరాధిస్తారు కానీ, కళాకారులు కావడానికి వారికి సమయం లేదు. ముఖ్యంగా వాణిజ్యంతో, వ్యవసాయంతో సంపద్వంతమైన వెలనాడు లాంటి రాజ్యాలలో.

**"గొడ్లను మేపుకోవాలి. పొలంలో బోలెడు పని ఉంది!"..**

"ఉప్పుడు కాదు. నాయన ఊరుకోడు.. తంతాడు!"..

ఈ సమాధానాలే.. ఎవ్వర్ని అడిగి చూసినా!

తెలతెలవారుతున్నది. వెచ్చని ఉషోదయ పవనాలు గోరింటాకు వర్ణపు భానుకిరణాలను తెచ్చి నిద్రిస్తున్న జాయపుని బుగ్గలకు గోరింటాకు పెడుతున్నాయి. దగ్గరగా ఓ గాత్రం.. తంబుర నాదంతో మేళవించి.. వీధివీధంతా ప్రతిధ్వనిస్తున్నది.

**శివా.. శివోహం! కేశవా.. నమోహం!!**

శివ కేశవులకు భేదమా.. సుజ్ఞానవంతులకు వాదమా..
శివా.. శివోహం! కేశవా.. నమోహం!!
పులిచర్మము కట్టే లింగడు.. పట్టు వస్త్రాలు కట్టే రంగడు..
ప్రేమ బూడిద రాసే లింగడు..
పట్టె నామాలెట్టే రంగడు.. ? శివ ?
ఎద్దు నెక్కినవాడు లింగడు.. గ్రద్ద నెక్కినవాడు రంగడు..
పాము పాగా చుట్టే లింగడు.. పాముపైనే పవ్వళించె రంగడు..
? శివ ?
కైలాసగిరి పైన లింగడు.. వైకుంఠపురమందు రంగడు..
శివ కేశవులకు భేదమా.. సుజ్ఞానవంతులకు వాదమా..
శివా.. శివోహం!.. కేశవా.. నమోహం!!


చెళ్లున చరచినట్లయ్యింది. లేచి వేగంగా బయటికి వచ్చాడు. ఓ భిక్షుక గాయకుడు.. తలకు తలపాగా, చిరుగుల కంచుకం, భుజాన జోలె, ముఖాన నిలువు అడ్డబొట్లు, వెలుగుతున్న గరుడ కమ్మి (ఎత్తుదీపం) ఓ చేతిలో, మెడలో పెరికెతాడు కట్టిన ఇత్తడి పళ్లెరంపై కర్రతో శబ్దం చేస్తూ ఇల్లిల్లూ తిరుగుతూ.. భిక్షాటనతో దీవెనలు ఇస్తూ పాడుకుంటూ పోతున్నాడు. హరిహర తత్వగీతం!.. తెలుగు ప్రాంతాలలో వేగంగా విస్తరిస్తున్న మరో మతకోణం! తిక్కనామాత్యులు తదితరులు తీవ్రంగా ప్రచారం చేస్తున్నారని విన్నాడు. అరె.. ఈ అంశం తెలిసినా ఎలా తన మనసు నుంచి తప్పుకొన్నది!? అతని వెనకే వెళ్లి ఆ తత్వగీతం పూర్తిగా విన్నాడు. "ఆయన మాల దాసరిగాడు. భలే భలే పాటలు కడతాడు!".. జాయపుని ఆశ్చర్యం చూసి పొదుంపుల్ల నోట్లో పెట్టుకున్న పౌరుడొకడు వివరణ ఇచ్చాడు. కాస్త ఆవలగా ఇలాగే ఏదో పాడుకుంటూ మరొక దాసరి.. దూరంగా మరొకడు. అక్కడెక్కడో మరో దాసరి గీతం! కాస్త పులకింత కలిగింది జాయపునికి. "అతడు.. ఆ దాసరి ఎక్కడుంటాడు?" అడిగాడా పొదుంపుల్లను. "అటు పో.. గడ్డిపాడు దాటిపో! ఆడ పెద్ద రాయిసెట్టు ఉంటది. ఆడ గుడిసెలుంటయ్. అందరూ దాసరిగాళ్లే! ఇప్పుడంతా అడుక్కోడానికి పోతారు. పొద్దుగుంకే యాలకు వత్తారు!". రోజంతా అస్థిమితంగా గడిపి పొద్దుగుంకే వేళకు గడ్డిపాడు అవతలనున్న ఆ రావిచెట్టు వద్దకు వెళ్లాడు. ఉప్పెన సమయంలో నిలిచిన నీటిచలమ ఎండిపోగా.. తిరిగి తేలిన మెరక నేల అది. సంచారజాతుల చిన్నచిన్న తాత్కాలిక గుడిసెలు. ఆడవాళ్లూ, పిల్లలూ ఉన్నారు. మగవాళ్లు ఎవ్వరూ లేరు. గ్రామ భిక్షాటన నుంచి రాలేదనుకుంటా. రావిచెట్టు మొదట్లోనున్న దిమ్మెపై కూర్చున్నాడు. జాయపునిలాంటి ఆకర్షణీయ విగ్రహం అక్కడ కనిపించడం ఆ మహిళలకు అబ్బురంగా ఉంది. గుడిసెల్లోంచి తొంగి చూస్తున్నారు. అది అలవాటైన జాయపుడు తలవొంచుకుని కూనిరాగం తీస్తూ కూర్చున్నాడు. కాస్త అవతలగా మరో రావిచెట్టు. దాని మొదట్లో చిన్నగూడులా ఓ గుడి. అందులోంచి ఎవరో గ్రామదేవత అనుకుంటా.. దూరానికి కూడా పెద్దపెద్ద కళ్లు.. జాయపుణ్నే చూస్తున్నట్లు. రానురానూ చీకటి ముసురుకుంటున్నది. ఎవరో మహిళ దైవప్రార్థన చేయడం వినిపించింది. ఆశ్చర్యంగా అటు చూశాడు. ఆ గ్రామదేవత ముందు ఓ వృద్ధ మహిళ పాడుతున్నది.

**శివశక్తే నమస్తుభ్యం!!**

కళాభ్యాం చూడాలంకృత శశికళాభ్యాం నిజతపః
ఫలాభ్యాం భక్తేషు ప్రకటిత ఫలాభ్యాం భవతుమే
శివాభ్యాం అస్తోక త్రిభువన శివాభ్యాం హృదిపున
ర్భవాభ్యాం ఆనంద స్ఫురదనుభవాభ్యాం నతిరియమ్ ?

చటుక్కున లేచి చూశాడు. ఆమె ఆ చిన్నగుడి ముందు చీపురుతో ఊడుస్తూ పాడుతున్నది. పూచికపుల్ల లాంటి వడలిన శరీరం. కానీ కంఠం మాత్రం ఖంగున మోగుతున్నది. ఉద్వేగంతో కూడిన శ్రావ్యత.. ఆ గొంతులో చిప్పిల్లుతున్నది. గుడిసెల్లోని స్త్రీలు బయటికి వచ్చి నిలబడ్డారు.. భక్తిగా చేతులు జోడించి. ఆమె సాయంకాలపు రంగపూజనం నిర్వహిస్తున్నది. చేతులు వెనక్కి కట్టుకుని వింటూ.. అటుగా నడవసాగాడు. ఊడ్చాక వెంట తెచ్చుకున్న కడవలోని నీళ్లతో కడిగింది. ముగ్గులేసింది. అన్ని సంస్కృత భక్తిగీతాలు. ప్రతిపదానికీ అర్థం తెలిసినట్లు.. మనోధర్మంతో తాదాత్మ్యతతో తడుముకోకుండా పాడుతున్నది. స నుంచి ని వరకు.. అంటే సంగీతం పూర్తిగా తెలిసినవారే.. సాని. ఆమె గుడిసాని కావచ్చు. పాడుతూనే చీర కొంగు నడుంవద్ద దోపి నాట్యానికి సిద్ధమై భంగిమ తీసుకుంది. అప్పుడెప్పుడో కాకతి ఉదయ భోగాలు నిర్వహిస్తుండగా చూశాడు. ఇప్పుడు.. ఇన్నేళ్ల తర్వాత మళ్లీ సంధ్యా భోగం సమర్పిస్తుండగా చూస్తున్నాడు. చూపు ఆ చిన్నగుడిలోని దేవుడిపైకి పోయింది. చిత్రంగా ఆ దైవరూపం చుట్టూ ఏదో వెలుగు.. చిరుకంపన. పిచ్చెక్కిపోయింది జాయపునికి. నిస్సందేహంగా ఆ దేవుడు ఆమె సమర్పణకు స్పందిస్తున్నాడు. పులకిస్తున్నాడు.

సూర్య ఉదయం
ప్రతి దినం... ప్రజా శ్రేయస్సుం
తెలుగు దిన పత్రిక
శనివారం 07 - 03 - 2026



# గ్లింప్స్‌తోనే భయపెట్టిన నాగచైతన్య

'అతీంద్రియ శక్తి మేల్కొన్నప్పుడు..సృష్టి ధర్మం తప్పినప్పుడు..విధి ఒక వృషకర్మను ఎంచుకుంటుంది' అనే పవర్‌ఫుల్ డైలాగ్‌తో 'వృషకర్మ' గ్లింప్స్ రిలీజ్ అయింది. 'విరూపాక్ష'ఫేం కార్తిక్ దండు దర్శకత్వంలో నాగచైతన్య హీరోగా నటించిన తాజా చిత్రం 'వృషకర్మ'. ఇందులో చైతూకి జోడీగా మీనాక్షి చౌదరి నటిస్తోంది. జయరామ్, స్పర్ష్ శ్రీవాస్తవ, సత్య కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా రిలీజ్ అయిన ఈ మూవీ గ్లింప్స్‌లో నాగ చైతన్య లుక్ చాలా పవర్‌ఫుల్‌గా ఉంది. గత చిత్రాలతో పోలిస్తే ఆయన బాడీ లాంగ్వేజ్ గ్రేడ్ చాలా కొత్తగా ఉంది. గ్లింప్స్‌తోనే భయపెట్టేశారు. అజనీష్ లోక్‌నాథ్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఈ గ్లింప్స్‌కు ప్రాణం పోసింది. బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్ , సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.

# శివాజీ కొత్త సినిమాకి సూపర్ ఆఫర్

టాలీవుడ్ ఇండస్ట్రీలో హిట్ జోడీగా పేరు తెచ్చుకున్న వారిలో శివాజీ, లయ కూడా ఉంటారు. వీరిద్దరూ చాలా సంవత్సరాల తర్వాత సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని అనే చిత్రంలో కలిసి నటించారు.సుధీర్ శ్రీరామ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని శ్రీ శివాజీ ప్రొడక్షన్స్ బ్యానర్ పై శివాజీ నిర్మించాడు. ఈ సినిమాని మొదట ఈటీవీ విన్ ఓటీటీలో నేరుగా విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. అందుకు సంబంధించిన విడుదల తేదీని కూడా అనౌన్స్ చేశారు. ఆ తర్వాత సడన్గా ఈ చిత్రాన్ని ఓటీటీలో కాకుండా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. అలాగే ఈ మూవీని మార్చి 6వ తేదీన రిలీజ్ చేయనున్నట్లు అనౌన్స్ చేశారు. గత కొంతకాలంగా చిన్న సినిమాలకు టికెట్ రేట్లను తగ్గిస్తూ వస్తున్న విషయం మనకు తెలిసిందే. దానితో కంటెంట్ బాగున్న చిన్న సినిమాలకు మంచి కలెక్షన్లు వస్తున్నాయి. ఇక సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని మూవీ బృందం కేవలం టికెట్ రేట్లను తగ్గించడం మాత్రమే కాకుండా మరో సూపర్ సాలిడ్ ఆఫర్ను కూడా అనౌన్స్ చేసింది. తాజాగా ఈ మూవీ యూనిట్ సింగల్ స్క్రీన్ ఉన్న థియేటర్లలో నలుగురు కలిసి టికెట్ తీసుకున్నట్లయితే 499 రూపాయలకే నాలుగు టికెట్లు మరియు ఒక పాప్‌కార్న్ ఇస్తామని, అదే మల్టీప్లెక్స్ థియేటర్లలో నలుగురికి పాప్‌కార్న్ తో కలిపి టికెట్ ధర కేవలం 699 రూపాయలే అని ప్రకటించారు. మరి ఈ ఆఫర్ ఈ సినిమా కలెక్షన్లపై ఎలాంటి ప్రభావాన్ని చూపుతుందో చూడాలి.



# మీ చెల్లెలు షాట్ స్కట్ వేసుకుంటే రేప్ చేయాలని మీకు అనిపిస్తుందా

నటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న వరలక్ష్మి శరత్‌కుమార్ ఇప్పుడు డైరెక్షన్‌లోకి అడుగు పెట్టింది. ఆమె స్వీయ దర్శకత్వంలో ప్రియమణి, ప్రకాష్ రాజ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'సరస్వతి'.మార్చి 6న ఈ సినిమా విడుదలకు సిద్ధంగా ఉండటంతో.. ప్రమోషన్స్‌లో జోరు పెంచిన చిత్ర బృందం వరుస ఇంటర్వ్యూస్ ఇస్తున్నారు. ఇందులో భాగంగానే రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న వరలక్ష్మి శరత్ కుమార్ మహిళల డ్రెస్సింగ్‌పై షాకింగ్ కామెంట్స్ చేసింది. మహిళలు వేసుకునే బట్టల కారణంగానే చాలా తప్పులు జరుగుతున్నాయని కొంతమంది మెన్స్ అభిప్రాయపడుతున్నారు.. దీనిపై మీరు ఏమంటారు అని యాంకర్ ప్రశ్నించగా.. 'మీకు ఒక చెల్లి ఉంది. ఆ చెల్లి ఒక షాట్ స్కట్ వేసుకుని వెళ్తుంది.. తనని రేప్ చేయాలని మీకు అనిపిస్తుందా? అనిపించదు కదా. ఇప్పుడు మగాళ్లు కూడా ఒక జీన్ ప్యాంట్ ఎంత ఒనీలి ఉంటుంది అంటే బెండ్ చేస్తే మొత్తం తెలుస్తుంది. అలాఅని నేను పోయి వాడిని జంప్ చేసి ఇలా చెయ్, అలా చెయ్ అని చెప్పను కదా.. ఇప్పుడు ఇన్నర్ వేర్ అనేది అందరూ ఉపయోగిస్తారు. మీరు కూడా చెడ్డీలు వేసుకుంటారు. మీది అందరికి కనిపిస్తది పర్వాలేదు. కానీ ఒక ఉమెన్ ది బ్రా స్ట్రాప్ బయటకు కనిపిస్తే చాలు గోల గోల చేస్తారు. లైఫ్ మొత్తం పోయింది అన్నట్లు చేస్తారు. ఏం ఉంది అందులో ఒక ఇన్నర్ వేర్ అంతే కదా. ఊరికే జడ్జ్ చేస్తారు ఎందుకు.. వాళ్ల బాడీ వాళ్ల ఇష్టం కదా. ఇప్పుడు మీ అమ్మతో, చెల్లితో మీకు అలాంటి ఫీల్ లేనప్పుడు బయట అమ్మాయి దగ్గర ఎందుకు ఆ ఫీల్ వస్తుంది' అంటూ ఫైర్ అయింది. ప్రజెంట్ ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ సంచనలంగా మారాయి.



# మరో ఓటీటీకి 'లాల్ సలామ్' .. స్ట్రీమింగ్ ఎక్కడంటే?

తమిళ హీరో రజనీకాంత్ ప్రత్యేక పాత్రలో నటించిన చిత్రం 'లాల్ సలామ్'.. 2024 విడుదలైన ఈ మూవీ ఇప్పటికే సన్ నెక్స్ట్‌లో స్ట్రీమింగ్ అవుతుంది. అయితే, తాజాగా హిందీ వర్షన్ ఓటీటీలోకి వచ్చేసింది.రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్య దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో విష్ణు విశాల్, విక్రాంత్ సంతోష్ ప్రధాన పాత్రల్లో నటించిగా రజనీకాంత్ అతిథి పాత్రలో కనిపించారు. 'లాల్ సలామ్' మూవీ సన్ నెక్స్ట్(రాబఅ చీఋ)లో తెలుగు, తమిళ్ వర్షన్‌లో స్ట్రీమింగ్ అవుతుంది. హిందీ వర్షన్ జియోహాట్‌స్టార్‌లో అందుబాటులో ఉంది. ఈ క్రమంలో తాజాగా హిందీ వర్షన్‌ను అమెజాన్ ప్రైమ్ వీడియోలో కూడా స్ట్రీమింగ్ అవుతుంది. కానీ, ఈ మూవీని చూడాలంటే అదనంగా రెంట్ చెల్లించాల్సి ఉందని పేర్కొనడం విశేషం. ఇప్పటికే ఒక ఓటీటీలో ఉచితంగా చూసే అవకాశం ఉన్న ఈ మూవీకి అదనంగా రెంట్ చెల్లించేలా షరతు పెట్టడం కాస్త ఆశ్చర్యానికి గురిచేస్తుంది. సుమారు రూ. 90 కోట్ల బడ్జెట్‌తో లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుభాస్కరన్ నిర్మించిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద కేవలం రూ. 52 కోట్లు మాత్రమే రాబట్టి భారీ డిజాస్టర్‌గా మిగిలిపోయింది. 'లాల్ సలామ్' కథ మొత్తం 1990ల కాలం బ్యాక్‌డ్రాప్‌తో నడుస్తోంది. మొయిదీన్ భాయ్ (రజనీకాంత్) కుమారుడు సంషి (విక్రాంత్), గురు (విష్ణు విశాల్) స్నేహితులు. షంషుద్దీన్ (విక్రాంత్)ను క్రికెటర్‌ను చేయాలన్నది తండ్రి కల. అనుకున్నట్లు గానే సంషి రాష్ట్ర రంజీ జట్టుకు ఆడటానికి ఎంపికవుతాడు. ఈ క్రమంలో ఆ ఊళ్లో త్రీస్టార్ – ఎంసీసీ టీమ్స్ మధ్య జరిగే క్రికెట్ ఆటతో రెండు మతాల మధ్య గొడవ మొదలౌతుంది. ఆ గొడవలోనే షంషుద్దీన్ చేతిని నరికేస్తాడు గురు అలియాస్ గురునాథం (విష్ణు విశాల్).. దాడి చేసిన గురు కూడా మొయిదీన్ భాయ్‌కి ప్రాణ స్నేహితుడు అయిన (ఫిలిప్ లివింగ్‌స్టోన్) కుమారుడు కావడం విశేషం. హిందూ ముస్లింలు ఐకమత్యంగా ఉండే ఆ ఊరిలో క్రికెట్ వల్ల మత కల్లోలంగా మారుతుంది. ముంబైలో వ్యాపారావేత్తగా రాణిస్తున్న మొయిద్దీన్ అ గ్రామానికి తిరిగొస్తాడు. కుమారుడి చేయి నరికిన స్నేహితుడి కుటుంబాన్ని మొయిదీన్ ఏం చేస్తాడు..? క్రికెట్‌లో గొడవలకు కారణం ఏంటి..? సంషి, గురు ప్రాణ స్నేహితుల మధ్య చిచ్చు ఎలా మొదలైంది..? తన కొడుకు చేయి నరికిన గురును మొయిద్దీన్ ఏం చేశాడు..? అనేది తెలియాలంటే జూన్ 6న సన్ నెక్స్ట్‌లో లాల్ సలామ్ చూడాల్సిందే.



I PRINTED, PUBLISHED & OWNED By M.SUNIL KUMAR at SWAMY OFFCET PRINTERS #1/339/17SREE RAM NAGAR, BHARPET, KURNOOL DISTRIC, ADONI 518301.
EDITOR : M.sunil kumar, #1/339/17, sree ram nagar, bharpet,near nobel college ,ramjal road Adoni kurnool district- 518301 Andhra Pradesh. E-mail: Suryaudhayamdaily@gmail.com